
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం జిల్లా వార్తలు
గురువారం 28, మార్చి 2024



అసమ్మతి నేతలను దారికి తెచ్చుకునేందుకు బ్లాక్‌మెయిల్ వ్యవహారాలకు అధికార వైసీపీ తెరతీసింది. అవసరమైతే నేరుగా ఆ పార్టీ అధినేత, సీఎం జగన్ నాయకులను పిలిపించుకుని ఖబడ్దార్ జాగ్రత్త! అని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. కొందరి వ్యాపారాలు, అందులో లొసుగులను ప్రస్తావిస్తూ ముందుగా సంకేతాలు పంపుతున్నారు. అనంతరం వారితో నేరుగానే అధినాయకులు మాట్లాడి హెచ్చరికలు జారీచేస్తూ సరికొత్త రాజకీయానికి తెరలేపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇటీవల ఈ వ్యవహారం శ్రుతిమించింది.

కొత్త ఒరవడికి శ్రీకారం

బెదిరింపుల వ్యవహారం బెడిసికొట్టడంతో మిగిలిన నాయకులను నేరుగా జగనే పిలిపించి మాట్లాడేందుకు శ్రీకారం పలికారు. తొలుత కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావుపై బెదిరింపు అస్త్రం ప్రయోగించారు. టికెట్ లభించని ఆయన అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసి స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి వచ్చే ఊహాగానాలను బయటకు వదిలారు. తర్వాత తన మిత్రుడైన సినీనటుడు బాలకృష్ణ ద్వారా టీడీపీ వైపు దృష్టిసారించారని వార్తలొచ్చాయి. వెంటనే వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి.. బాబూరావును సీఎం వద్దకు తీసుకెళ్లారు. బాబూరావుకు కనిగిరి నియోజకవర్గంలో ఫార్మసీ కళాశాల ఉంది. ఆయన వియ్యంకుడికి విశాఖపట్నం వద్ద ఫార్మా కంపెనీలున్నాయి. ఈనేపథ్యంలో అనేక అంశాలను గుర్తుచేస్తూ అధిష్ఠానం నుంచి సంకేతాలు ఇచ్చి సీఎంను కలిపి ఆయనను సైలెంట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.



ఖబడ్దార్!

వైసీపీ బ్లాక్‌మెయిల్ రాజకీయం

సీఎంనే రంగంలోకి..

- కొందరికి పదవులు, మరికొందరికి బెదిరింపులు
- అసమ్మతిని బుజ్జగించేందుకు జగన్ మార్క్ పంథా
- చక్రం తిప్పుతున్న ఒంగోలు ఎంపీ అభ్యర్థి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వైసీపీ అధిష్ఠానం సరికొత్త రాజకీయానికి తెరలేపింది. మాట వింటే ఓకే.. లేకుంటే బెదిరింపులకు తెగబడుతోంది. చిన్నాచితక పదవులతో సరిపెట్టుకోవడం లేదా భవిష్యత్‌లో న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని నమ్మి పనిచేస్తే సరి! లేకుంటే అసలుకే ఎసరు పెడతామని హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో అవకాశం లభించని పలువురు సీనియర్లు పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. వారిలో కొందరిని పార్టీ, నామినేటెడ్ పదవులతో బుజ్జగించారు. అందుకు అవకాశం లేనివారిని, చిన్నాచితక పదవులకు లొంగని వారిని బెదిరించడం ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సిటింగ్ ఎమ్మెల్యేలలో ముగ్గురికి, మాజీలలో నలుగురికి పార్టీ టికెట్ల విషయంలో అధిష్ఠానం మొండిచేయి చూపింది. వారిలో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డికి హడావుడిగా ఏపీఐఐసీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. అదే నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు ఆలీబేగ్‌కు ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఎన్నికల షెడ్యూల్‌కు రెండు రోజుల ముందు ఇచ్చేశారు. టికెట్ల లభించక అసమ్మతితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఆ పార్టీ నాయకులకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. తాజాగా ఆయన వేరే పార్టీలోకి వెళ్లే అవకాశం ఉందని తెలిసి ఆయన వ్యాపారాలపై దృష్టిసారించారు. కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి పార్టీ అభ్యర్థికి ప్రచారం చేయకపోయినా వెళ్లిన పార్టీ నాయకులతో మాట్లాడుతూ కాలం గడుపుతున్నారు. ఆయనకు స్థానికంగా వ్యాపారాలు ఏమీ లేవు. వైసీపీ అద్దంకి మాజీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య టికెట్ లభించక అలకపాన్పు ఎక్కగానే ఆయన గ్రానైట్ క్వారీపై దాడులు నిర్వహించి నోటీసులు జారీచేశారు. క్వారీ మూసేసిన చైతన్య టీడీపీలో చేరిపోయారు.

మాజీ ఎమ్మెల్యే ఆమంచిపైనా కన్ను

చీరాలలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి స్వంతంత్ర అభ్యర్థిగా బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయన పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు జరిగిన అవినీతి వ్యవహారాలను, చీరాలలో ఆయన సంస్థలలో ఉన్న లొసుగులను అప్పట్లోనే సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సొంత పార్టీ వారే జగన్‌కు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు. అయినా పట్టించుకోని అధిష్ఠానం ఇప్పుడు చీరాలలో స్వతంత్రఅభ్యర్థిగా రంగంలోకి రాబోతున్న తరుణంలో కొరడా ఝులిపిస్తోంది. ఆమంచికి చెందిన క్రిస్టల్ సీ ఫుడ్స్ ఆయన సమీప బంధువులకు చెందిన హేచరీలకు సంబంధించి సుమారు రూ.5.82కోట్ల విద్యుత్ బకాయి ఉంది. గతంలో ఆయన అధికారాన్ని అడ్డుపెట్టి దశలవారీ బకాయి చెల్లింపునకు అనుమతి తెచ్చుకున్నారు. అప్పుడు చేయూతనిచ్చిన ప్రభుత్వం ఇప్పుడు విద్యుత్ శాఖ ద్వారా బకాయిల వసూళ్లకు ఒత్తిడి పెంచింది. మరోవైపు ఆయన ఆక్వా భూములు, ఇతర అంశాలకు సంబంధించి కూడా లొసుగుల కోసం అధికారులు పరిశీలన ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే మాజీ మంత్రి శిద్దా, మాజీ ఎమ్మెల్యే బాబూరావులు వెనక్కు తగ్గినప్పటికీ బహిరంగంగా వైసీపీ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొనడం లేదు. ఆమంచి మాత్రం ఇండిపెండెంట్‌గా పోటీ ఆలోచనతోనే అనుచరులతో మంతనాలు జరుపుతున్నారు. అసమ్మతి నేతలపై బెదిరింపు వ్యవహారాలకు పాల్పడుతున్న వైసీపీ పోకడను నాయకుల అనుచరులు మాత్రం తీవ్రంగా ద్వేషిస్తున్నారు.

శిద్దా సైలెంట్

తాజాగా మాజీమంత్రి శిద్దా రాఘవరావును కూడా జగన్ వద్ద హాజరుపరిచారు. గత ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన శిద్దా గ్రానైట్ సంస్థలపై జగన్ ప్రభుత్వం ఆరంభంలోనే దాడి చేసింది. సుమారు రూ.300 కోట్ల జరిమానాలను విధించింది. క్వారీలలో పనులు నిలిపివేసింది. టీడీపీ ఎమ్మెల్యే అయిన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు క్వారీలపైనా అలాంటి చర్యలే తీసుకున్నారు. వెంటనే శిద్దా వైసీపీలో చేరడంతో జరిమానా నోటీసులు పక్కనపెట్టి క్వారీలు నడుపుకునేందుకు అవకాశం ఇచ్చారు. పార్టీ మారని రవికుమార్, రామారావుల క్వారీలు, ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. తాజాగా టీడీపీలో చేరాలన్న ఆలోచనతో శిద్దా కొంతకాలంగా వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. వైసీపీలో దర్శి టికెట్ ఆశించి విఫలమైన ఆయన టీడీపీలో వచ్చే అవకాశం ఉండటంతో మంతనాలు ప్రారంభించారు. బుధవారం ఆయన టీడీపీ అధినాయకులను కలిసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో హడావుడిగా మంగళవారం ఆయన్ను సీఎంవో అధికారులు పిలిపించి జగన్ ముందు హాజరుపరిచారు. గ్రానైట్ క్వారీలకు, కంపెనీలకు గతంలో ఇచ్చి పెండింగ్‌లో ఉన్న నోటీసుల వ్యవహారం చర్చకు తెచ్చినట్లు తెలిసింది. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుంది అని చెప్పి ఆర్థిక వనరులకు ఎదురయ్యే సమస్యలను కూడా పరోక్షంగా ముందుగానే ఆయన దృష్టికి తీసుకెళ్లి తర్వాత సీఎం ముందు ప్రవేశపెట్టినట్లు సమాచారం. సీఎం కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవి అవకాశం ఇస్తానంటూ పరోక్షంగా కొన్ని సమస్యలను ప్రస్తావించి పంపినట్లు తెలిసింది. దీంతో శిద్దా, ఆయన కుటుంబసభ్యులు ఈ ఎన్నికల్లో పోటీ ఆలోచన విరమించుకుని సైలెంట్ అయ్యారు.



వై.పాలెం వైసీపీ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పిస్తున్న వలంటీర్ రాముడు నాయక్

వెరవని వలంటీర్లు

- తొలగిస్తామని హెచ్చరిస్తున్నా వెనక్కి తగ్గని పరిస్థితి
- అధికారపార్టీ నేతలతో కలిసి ఇష్టారీతిన ప్రచారం
- ఓటర్లను ప్రభావితం చేస్తున్నా పట్టించుకోని అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 27 : జిల్లాలో వలంటీర్లు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నా అధికారుల చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అధికారం మాదే అన్న చందంగా వలంటీర్లు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనేతలతో కలిసి బహిరంగంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి నుంచే వలంటీర్లకు అనుకూలంగా వ్యవహారాలు నడుస్తుండటంతో క్షేత్రస్థాయిలో వారు చెప్పిందే వేదం అన్నట్లు పరిస్థితి తయారైంది. ప్రతిరోజూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లు ఎక్కడికక్కడ అధికారపార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నట్లు ఫొటోలు, ఫిర్యాదులు వస్తున్నా ఏదో మొక్కుబడిగా ఒకరిద్దరిని తొలగిస్తున్నారే తప్ప మిగిలిన వారి గురించి పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి పది రోజులు దాటినా ఈ కాలంలో పట్టుమని పదిమందిని మాత్రమే విధుల నుంచి తొలగించారు. దీంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్ల హవానే నడుస్తోంది. ఆయా ప్రాంతాలకు అధికారపార్టీ నేతలు వచ్చిన సమయంలో ఆయా గృహాల వద్ద వారే ముందుండి మాట్లాడిస్తున్నారు. అందరూ బయటకు వచ్చి వైసీపీ నాయకులతో మాట్లాడాలంటూ బెదిరిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు అడపాదడపా కొంతమందిని తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటనలు ఇస్తున్నా అవేమీ అమలు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఎన్నికల ప్రచారంలో అధికారపార్టీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొనే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాల నేతలు కోరుతున్నారు.

వలంటీర్ రాజీనామా

టంగుటూరు : టంగుటూరు గ్రామ సచివాలయం-2 పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్న కసుకుర్తి ఆగమనరాజు బాధ్యతల నుంచి తప్పుకున్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి జగదీష్‌ను కలిసి రాజీనామా పత్రం సమర్పించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఎవ్వరికీ అసౌకర్యం కలిగించకూడదన్న ఉద్దేశంతో రాజీనామా చేసినట్లు ఆయన వెల్లడించారు.



పరీక్ష అనంతరం ఓ కేంద్రం వెలుపల కేరింతలు కొడుతున్న విద్యార్థులు

ముగిసిన పది పరీక్షలు

- విద్యార్థుల కేరింతలు
- హాస్టళ్ల నుంచి ఇళ్లకు పయనం



ఓ పరీక్షా కేంద్రం వద్ద వీడ్కోలు చెప్పుకుంటున్న విద్యార్థినులు

ఒంగోలు(విద్య), మార్చి 27 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కీలక సబ్జెక్టుల పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. ఈసారి ఒక్కరంటే ఒక్క విద్యార్థి కూడా డిబార్ కాలేదు. 4 ఎస్ పరీక్షకు ఈనెల 28న 94 కేంద్రాల్లో 3,407 మంది, ఓఎస్ఎస్‌సీ పరీక్షకు రెండు కేంద్రాల్లో 15మంది, ఈనెల 30న ఒకేషనల్ పరీక్షకు 22 కేంద్రాల్లో 2,226మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మిగిలిన విద్యార్థులందరి పరీక్షలు ముగిశాయి. జిల్లాలో బుధవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 28,160మందికిగాను 27,898 మంది (99శాతం) హాజరయ్యారు. 262మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు కేవలం 22.83 శాతం మంది మాత్రమే పరీక్ష రాశారు. మొత్తం 600మందికి గాను 137 మంది మాత్రమే హాజరు కాగా 463 మంది డుమ్మాకొట్టారు. పరీక్షల పరిశీలకులు ఎం.ఆర్.ప్రసన్నకుమార్ ఏడు, జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర మూడు కేంద్రాలను సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మొత్తం 60 కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ముఖ్యమైన పరీక్షలన్నీ ముగియడంతో విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. పరీక్ష అనంతరం కేంద్రాల నుంచి బయటకు రాగానే విద్యార్థులు కేరింతలు కొట్టారు. బస్సుల్లో ఎక్కి తమ చేతుల్లోని పేపర్లను ముక్కలుగా చించి రోడ్లపై చల్లారు. ఒంగోలులోని హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు లగేజీ సర్దుకొని తల్లిదండ్రులతో తమ సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండు రద్దీగా మారింది.

మద్యం దొంగలు దొరికారు!

- ప్రభుత్వ వైన్‌షాపు నుంచే బెల్ట్ దుకాణానికి సరఫరా
- 288 క్వార్టర్ బాటిళ్లను పట్టుకున్న ఎస్‌ఈబీ అధికారులు
- సిబ్బందిపై కేసులు



మద్యం బాటిళ్లు, అరెస్టు చేసిన ప్రభుత్వ వైన్‌షాపు సిబ్బందితో ఎస్‌ఈబీ అధికారులు

కంభం, మార్చి 27 : ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బెల్టుషాపునకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎస్‌ఈబీ అధికారులు పట్టుకున్నారు. రూ.45వేల విలువైన సరుకును, ప్రభుత్వ దుకాణంలో పనిచేసే ఇద్దరు సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలను ఎస్‌ఈబీ డీఎస్పీ దుర్గాప్రసాద్ విలేకరులకు బుధవారం వివరించారు. ఆయన కథనం మేరకు.. అర్ధవీడు మండలం కాకర్ల గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేసే కొప్పుల వెంకట రమేష్, వాచ్‌మన్‌గా పనిచేస్తున్న దార్ల అనిల్, యాచవరంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న యామా చిన్నవెంకటేశ్వర్లు కలిసి బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో సుమారు రూ.48వేల విలువైన 288 క్వార్టర్ బాటిళ్లను కారులో యాచవరం బెల్టుషాపునకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న కంభం ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ, ఎస్సై సత్యనారాయణరావు పోతురాజుటూరు గ్రామసమీపంలో మాటువేశారు. అటువైపు వస్తున్న కారును నిలిపి తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు దొరికాయి. కారుతోపాటు రమేష్, అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. మద్యం సీసాలు, కారు, నిందితులను గిద్దలూరులో కోర్టు హాజరుపరిచినట్లు డీఎస్పీ చెప్పారు.



మల్లాపాలెంలో వైసీపీ రంగులతో ట్యాంకరుతో తోలుతున్న నీరు

కోడ్ లేదా సారూ..!

- వైసీపీ రంగుల ట్యాంకర్‌తో నీటి సరఫరా
- మల్లాపాలెం వైపు చూడని ఎన్నికల అధికారులు

పుల్లలచెరువు, మార్చి 27: మండలంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గ్రామాల్లో ఎన్నికల అధికారుల పర్యవేక్షణ కరువవడంతో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ రంగులతో ట్యాంకర్లు, జెండాలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. మండలంలోని మల్లాపాలెంలో యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. గ్రామంలో అధికార పార్టీ నియోజవర్గ నాయకుడి ఆధ్వర్యంలో ట్యాంకర్‌కు వైసీపీ రంగులు పూసి ఇంటింటికీ నీటి సరాఫరా చేస్తున్నారు. అయినప్పటికీ, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుచేయని అధికారులపై జిల్లా ఎన్నికల అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

సిల్వర్ డిస్క్ అవార్డుకు ఎస్పీ ఎంపిక



ఒంగోలు (క్రైం), మార్చి 27 : పోలీసు శాఖలోని డీజీపీ సిల్వర్ డిస్క్ అవార్డుకు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఎంపికయ్యారు. ఆ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి బుధవారం సమాచారం అందింది. చీమకుర్తిలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఎం.కృష్ణమూర్తి, రాచర్లలో పనిచేస్తున్న పి.చెన్నకేశవరెడ్డి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బి.మల్లికార్జునరావులు కూడా డీజీపీ సిల్వర్ డిస్క్ అవార్డులకు ఎంపికయ్యారు. బ్రాంజ్‌డిస్క్ అవార్డుకు డీఎస్పీ ధనుంజయుడు, సీఐ బి.పాపారావు, ఏఆర్ ఎస్ఐ ఎన్.రాఘవరావు, టి.జాషువా, ఏఎస్ఐ బి.సత్యశ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ వై.శ్రీనివాసరావు, ఏఎస్ఐలు ఈ.వెంకటస్వామి, బి.శ్రీనివాసులు, కె.లక్ష్మీనారాయణ, పి.కొండయ్య, కానిస్టేబుల్ టి.మురళి, కోస్టల్ సెక్యూరిటీలో పనిచేస్తున్న కానిస్టేబుల్ డి.పవన్‌కుమార్ ఎంపికయ్యారు.


ఎన్నికల తాయిలాలు భారీగా పట్టివేత



పట్టుబడిన చీరలు, సంచులను పరిశీలిస్తున్న అధికారులు

- ఒంగోలు నగర పరిధిలోని ఓ గోదాంలో నిల్వ
- రూ.20లక్షల విలువైన చీరలు, సంచులు స్వాధీనం
- సంచులపై ముఖ్యమంత్రి జగన్, బాలినేని ఫొటోలు

వివరాలు మెయిన్‌లో..



చీరలు, సంచులు ఉంచిన గోదాం

వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 27 : వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు ఇతర ప్రాధాన్యత రంగాలకు కూడా లక్ష్యానికి అనుగుణంగా రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బుధవారం జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఎల్‌డీఎం అబ్దుల్‌రహీమ్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధరంగాలకు 105.69 శాతం రుణాలు మంజూరు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 10511 మందికొత్త రైతులకు రూ.232.72కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. డీఆర్‌డీఏ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు లక్ష్యంలో 78.79 శాతం, మెప్మా పరిధిలో మహిళలకు 340.08శాతం రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 17,988 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంలో ఇప్పటివరకు రూ.16,819 కోట్లతో 93.5శాతం రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఆయా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా మహిళల జీవనోపాధి మరింత మెరుగుపడేలా రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. పాడిపరిశ్రమ ఆధారంగా జీవిస్తున్న కుటుంబాలకు అండగా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నందున అందుకు అనుగుణంగా బ్యాంకర్లు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత, మైక్రోఫుడ్, ప్రాసెసింగ్, విద్యా రుణాల మంజూరును వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పీడీసీసీ బ్యాంకు సీఈవో కోటిరెడ్డి, వివిధ శాఖల అధికారులు బి.శ్రీనివాసులు, వసుంధర, రవికుమార్, జేబీరాణి, చంద్ర శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, ధనలక్ష్మి, అర్చన, ఉదయ్‌కుమార్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పూర్తి స్థాయిలో పరిష్కారం

జిల్లాలో ఎన్నికలకు సంబంధించిన ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిష్కరించినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సంబంధిత అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్లను ప్రలోభపెట్టేలా తరలిస్తున్న అనుమానిత సుమారు రూ.45 లక్షల విలువైన డబ్బు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు అంతకు ముందు సీఈవో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్న నివేదికలను ప్రతిరోజు సకాలంలో పంపించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి : జేసీ

నాగులుప్పలపాడు మార్చి 27 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జేసీ గోపాలకృష్ణ ఆదేశించారు. నాగులుప్పలపాడు జాతీయ రహదారి పై ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. వాహనాల తనిఖీలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జేసీ మట్లాడుతూ ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద ప్రజాప్రతినిధుల వాహనాలకు ఎలాంటి మినహాయింపు లేదన్నారు. సరైన పత్రాలు లేకుండా 50 వేలకు మించి నగదును తరలించకూడదని స్పష్టం చేశారు. అనంతరం తిమ్మసముద్రం, మట్టిగుంట గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మహాలక్ష్మి, రూరల్ సీఐ అజయ్ కుమార్, ఎస్సై బ్రహ్మనాయుడు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సముద్రంలో యువకుడి గల్లంతు

నాగులుప్పలపాడు మార్చి 27: సముద్రంలో ఈతకు వెళ్ళిన యువకుడు గల్లంతైన సంఘటన బుధవారం జరిగింది. ఒంగోలు మండలం పెద్ద దేవరంపాడుకు చెందిన గడ్డం హేమంత్ (18), వడ్లమూడి వెంకటేష్, బొడ్డు వెంకటేశ్వర్లు కలిసి కనపర్తి పంచాయతీ పరిధిలోని మేకల సోమయ్య పట్టపుపాలెం వద్ద సముద్రంలో ఈతకు వెళ్ళారు. ముగ్గురు యువకులు సముద్రం లోపలికి వెళ్ళి ఈత కొడుతున్న సమయంలో అలల ఉధృతికి గల్లంతయ్యారు. వడ్లమూడి వెంకటేష్, బొడ్డు వెంకటేశ్వర్లు బయటకు రాగా హేమంత్ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గాలింపు చేపట్టారు.

నివేశన స్థలాల కోసం
వివాదాలు సృష్టించుకోవద్దు

- మత్స్యకారులకు అధికారుల సూచన



మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్, సీఐ

నాగులుప్పలపాడు మార్చి 27 : మత్స్యకారులు జగనన్న కాలనీ ఇంటి స్థలాల విషయంలో వివాదాలు సృష్టించుకోవద్దని అధికారులు సూచించారు. కనపర్తి పంచాయతీ పరిధిలోని మేకల సోమయ్య పట్టపుపాలెం, బీచ్‌రోడ్ పట్టపుపాలెం గ్రామాల మత్స్యకారుల మధ్య జగనన్న కాలనీ ఇంటి స్థలాల పంపిణీ విషయంలో వివాదం నెలకొంది. బీచ్‌రోడ్ పట్టపుపాలెం మత్స్యకారులు లేఅవుట్‌లోకి వెళ్ళకుండా ముళ్లకంచెలు వేయడంతో వివాదం రేగింది. దీంతో మేకల సోమయ్య పట్టపుపాలెంకు చెందిన మత్స్యకారులు ఎస్పీ పరమేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేయడంతో మంగళవారం అర్ధరాత్రి తహసీల్దార్ శ్రీనివాసరావు, రూరల్ సీఐ అజయ్‌కుమార్, ఎస్సై బ్రహ్మనాయుడు హుటాహుటిన అక్కడకు చేరుకొని ఇరు గ్రామాల మత్స్యకారులతో మాట్లాడి శాంతింపజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మేకల సోమయ్య పట్టపుపాలెం, బీచ్‌రోడ్ పట్టపుపాలెం గ్రామస్థులకు జగనన్న కాలనీలు నిర్మించేందుకు 72మందికి ఇంటి స్థలాలను అందించేలా లేఅవుట్‌ను సిద్ధం చేశామన్నారు. అయితే 14 మందికి మాత్రమే గతంలో పట్టాలు ఇచ్చారని, అర్హులైన ఇరు గ్రామాల మత్స్యకారులందరికీ స్థల పట్టాలు అందించేందుకు సిద్ధం ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జాప్యం జరుగుతుందన్నారు. కోడ్ ముగిసిన వెంటనే అందరికీ నివేశన స్థల పట్టాలు ఇస్తామని చెప్పారు. వివాదాస్పదంగా మారిన జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఎవరూ ప్రవేశించకుండా 145 సెక్షన్ అమలు చేస్తూ తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. సీఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య సృష్టించవద్దని, సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అధికారులను సమన్వయం చేసుకుని శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

ఒంగోలు అభివృద్ధి టీడీపీ హయాంలోనే..!

- నియోజకవర్గ అభ్యర్థి దామచర్ల
- హౌసింగ్‌బోర్డు కాలనీలో ప్రచారం



మేనిఫెస్టో పత్రాలను అందజేస్తున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్) మార్చి 27: ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే జరిగిందని, తనకు ఎమ్మెల్యేగా మరో అవకాశం ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. జనం కోసం జనార్దన్, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నగరంలోని 19వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా నగర అభివృద్ధి కోసం వేల కోట్లు రూపాయాల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. అన్ని ధరలు పెంచేసి ప్రజలపై భారాలు మోపిన దుర్మార్గపు పాలన చేసిన వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని చెప్పారు. టీడీపీ చేసిన అభివృద్ధిని గుర్తించాలని కోరారు. గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో జరిగిన నష్టాలను ప్రజలు గమనించారన్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబుతోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ లభిస్తుందని దామచర్ల స్పష్టం చేశారు. ప్రజలు ఆశీర్వదించి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి చేసేందుకు మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి, ముఖ్యమంత్రి బంధువుగా చెప్పుకునే ఇక్కడి వైసీపీ నాయుకుడు ఒంగోలు అభివృద్ధికి ఏమిచేశారో ప్రజలకు చెప్పాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నగరంలో భూకబ్జాలు, బెదిరింపులు, అధికారులను తమ గుప్పెట్లో ఉంచుకుని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే టీడీపీ వారిపై అక్రమంగా కేసులు, ఖాళీ స్థలాలు కనిపిస్తే ఆ పార్టీ నేతలు కబ్జా చేయడంతో నేడు నగరంలో ప్రజల ఆస్తులకు రక్షణ కరువైందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులైన పేదలకు 2 సెంట్లు భూమి ఇస్తామని, అలాగే వైసీపీ పాలనలో నిర్లక్ష్యంగా వదిలేసిన టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి అర్హులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మరో ఆరువేల మందికి నూతనంగా టిడ్కో ఇళ్ళు ఇస్తామని తెలిపారు. సైకో జగన్ పాలనకు తగిన గుణపాఠం చెప్పాలని, టీడీపీని ఆశీర్వదించాలని దామచర్ల కోరారు. ఈ సందర్భంగా టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, అప్పాజి, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, కాట్రగడ్డ శింగయ్య, తేళ్ళ అరుణ, నాళం నరసమ్మ, బీరం అరుణ, స్థానిక నాయకులు ఇందుర్తి మారుతిరావు, రామారావు, జాజుల శివాజీ, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు హారతులతో దామచర్లకు ఘనంగా స్వాగతం పలికారు. అంతకముందు స్థానిక సాయిబాబా గుడిలో దామచర్ల ప్రత్యేక పూజలు చేశారు.

వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రగతి శూన్యం

- ఎస్‌ఎన్‌పాడు టీడీపీ అభ్యర్థి బీఎన్



కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్, నాయకులు

మద్దిపాడు, మార్చి 27: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, ప్రగతి ఎక్కడా కనపడటంలేదని సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయకుమార్ విమర్శించారు. బుధవారం ఇనమనమెళ్లూరు గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ఎస్సీలపై దౌర్జన్యాలు పెరిగాయన్నారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. దళితుల పథకాలను పక్కదారి పట్టించారని ఆయన ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించేలా మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భావన్నారాయణ, మందపల్లి శ్రీనివాసరావు, డొప్ప శేషయ్య, డొప్ప సుబ్బయ్య, ప్రభాకర రెడ్డి, గంగవరపు జోసఫ్, ముల్లూరి మురళి, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, అన్నమనేని సుబ్బారావు, జనసేన మండల అధ్యక్షుడు నున్న బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి వీరయ్యచౌదరి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న వీరయ్యచౌదరి

నాగులుప్పలపాడు, మార్చి 27: రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్యచౌదరి కోరారు. ఉప్పుగుండూరులోని కమ్మవారి రామ మందిరంలో గురువారం రాత్రి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు సమావేశం గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరయ్యచౌదరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలు తిప్పికొట్టాలని, టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, విజయ్‌కుమార్ విజయానికి అందరూ పాటు పడాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్‌కుమార్ వైసీపీ రాక్షసపాలనను తరిమికొట్టి అభివృద్ధి చిరునామా అయిన తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందామన్నారు. బీఎన్.విజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీపీ మండల అధ్యక్షులు బెల్లం వెంకటేశ్వర్లు, గోగినేని ఆంజనేయులు, తెలగతోటి జాన్సన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

అమ్మనబ్రోలు ఎస్టీకాలనీకి వైసీపీకి చెందిన ఏడు కుటుంబాల వారు ముప్పవరపు వీరయ్య చౌదరి, మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి వీరయ్యచౌదరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈదర వెంకట కృష్ణారావు, మిరియాల రమణ, స్వర్ణ కిషోర్, ఇండ్ల శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు, నమస్కరిస్తున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, మార్చి 27: సంతనూతలపాడులో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివార్ల విగ్రహప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం కనుల పండువగా జరిగాయి. గత నాలుగురోజులుగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితులు ఎన్.జగదీశ్వరఆచార్యుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అనంతరం భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున, టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ తదితరులు వేర్వేరుగా స్వామివార్ల పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

చంద్రపాడులో ఘనంగా రామాలయ ప్రతిష్ఠ

చీమకుర్తి : చంద్రపాడు గ్రామంలో జీర్ణోద్ధరణ గావించిన శ్రీసీతారామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందరర్భంగా ఆలయంలో మూల



శ్రీసీతారామస్వామి మూలవిరాట్

విరాట్‌లకు ప్రాణప్రతిష్ఠ, ధ్వజస్తంభం, విమాన శిఖర, బింబకళావాహనంలను వేలాదిమంది భక్తుల సమక్షంలో ప్రతిష్ఠ చేశారు. టీటీడీ అర్చకస్వామి పరాంకుశం కృష్ణశాయి భట్టాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు అలఘరి హనుమత్ ప్రసాద్‌ల పర్యవేక్షణలో ప్రతిష్ఠాకార్యక్రమాలను జరిపారు. మంత్రి మేరుగ నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మూలవిరాట్లను దర్శించుకొని పూజలు జరిపారు. అలాగే టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ నాయకులతో కలిసి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు విచ్చేశారు. సాయంత్రం సీతారామకళ్యాణ మహోత్సవం కనులపండవగా జరిగింది.

ఘనంగా రంగస్థల దినోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 27: నాటకం సమాజంలో చైతన్యాన్ని తీసుకువచ్చి మంచి సమాజ నిర్మాణానికి ఉపకరించే ఆయుధం వంటిదని ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) పేర్కొన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా శ్రీనాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటు చేసిన నాటక ప్రదర్శన కార్యక్రమాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటకాన్ని బతికించుకోవాల్సిన ఆవశ్యకత రంగస్థల నటులు, ప్రేక్షకులు, దాతల పై ఉందన్నారు. సీనియర్ రంగస్థల నటుడు పరాంకుశం కేశవాచార్యులు ప్రసంగిస్తూ ఎంతోమంది నాటకరంగంపై తమ నట ప్రస్థానాన్ని ప్రారంభించి అనంతర కాలంలో సినీ పరిశ్రమలో వెలుగొందారన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కుందూరు పుల్లారెడ్డిని నిర్వాహక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లిఖార్జునరావు, కనమాల రాఘవులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. లలిత కళా అకాడమీ అధ్యక్షుడు సంతవేలూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, రాయిపాటి ఆశీర్వాదం, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబు, ఆర్.సదానందరావు తదిత రులు పాల్గొన్నారు. అనంతరం చందూ డాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించారు. అకాడమీ కో ఆర్డినేటర్ కోవెలకుంట్ల బాలకో టయ్య ఆధ్వర్యంలో చిన్నారులు శ్రీ శంతన, ప్రజ్ఞ, అంకిత, ఆకాంక్ష, సుమనస్విని, యశస్విని, హస్విత, రాజశ్రీ, హర్షిత నృత్యాలను ప్రదర్శించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

కార్యక్రమంలో భాగంగా భక్త చింతామణి నాటకంలో భవానీ శంకరుడిగా కొప్పోలు వెంకటేశ్వర్లు, చింతామణిగా నెల్లూరు భానుమతి నటించగా, శ్రీ రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకంలో శ్రీరాముడుగా ఎం.సాంబశివరావు, ఆంజనేయునిగా దామవరపు ముసలయ్య, సత్యహరిశ్చంద్ర వారణాసి ఘట్టంలో చిటితోటి బాబూరావు, భానుమతి, కన్నబాబు, రాసాని రత్తయ్య, జోగి సుబ్బారావులు తమ నటనా చాతుర్యంతో ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు.

అటు సూపర్ స్టార్ కృష్ణ కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ గ్రంథాలయంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాపరిషత్ అధ్యక్షుడు జాలాది మోహన్ ఆధ్వర్యంలో అనంతరం మిడసల వెంకటేశ్వర్లు, దార్ల నారాయణ, పాలేటి కోటేశ్వర రావు, మద్దులూరి జయరావు, దాసరి నారాయణ రాజు, కసుకుర్తి నాగేశ్వర రావు, కంద్రాతి రామారావు, పిట్ల కృష్ణ తదితర రంగస్థల కళాకారులను ఘనంగా సత్కరించారు.

అవీ..ఇవీ..

జనసేన అధినేతను కలిసిన మాగుంట



పవన్‌కళ్యాణ్‌ను సత్కరిస్తున్న ఎంపీ మాగుంట తదితరులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 27 : జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు యువ పారిశ్రామికవేత్త రాఘవరెడ్డి మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పవన్‌కల్యాణ్‌ను శాలువతో సత్కరించి బొకే అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, కుప్పా రంగసాయి, అయినాబత్తిన ఘనశ్యాం, కండే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యాదవులపై దాడులు చేస్తే సహించేది లేదు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 27 : ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో యాదవులపై దాడులు చేయడంతో పాటు కించపరిచే విధంగా వ్యవహరించే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో సంతనూతలపాడు, అద్దంకి నియోజకవర్గాలల్లో యాదవ సంఘం నాయకులపై దౌర్జన్యంగా వ్యవహరించడం దుర్మార్గంగా ఉందన్నారు. చీమకుర్తిలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు రావులపల్లి శ్రీహరి యాదవ్‌పై అధికార వైసీపీ నాయకులు దాడి చేశారని, అద్దంకి నియోజకవర్గంలోను దాడి చేయడం దారుణంగా ఉందన్నారు. ఇటువంటి దాడులకు పాల్పడకుండా ఆయా పార్టీల నాయకులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో యాదవుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు.

పురందేశ్వరిని కలిసిన నాయకులు



పురందేశ్వరిని కలిసిన జిల్లా నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 27 : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని ఆ పార్టీకి చెందిన జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పురందేశ్వరిని కలిసి పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థులను మంచి మెజార్టీతో గెలిపించేలా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ ఆరాచక ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రతి బీజేపీ సైనికుడు పనిచేయాలని నాయకులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో నాయకులు శిగ్గం శ్రీనివాసులు, నరాల శ్రీనివాసరెడ్డి, జె.కోటేశ్వరి, సీతారామయ్య అనిల్, సింగోతు రాజేష్‌వర్మ, చాపల హరికృష్ణ, కిలారు రవి, కళ్లం సుబ్బారెడ్డి, తన్నీరు శ్రీనివాసరావు, కె.ప్రసాద్, డి.శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

31న భగత్‌సింగ్ వర్ధంతి సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 27: ఒంగోలులోని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ఈనెల 31 వతేదీన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్లు నాస్తిక సమాజం జిల్లా నాయకులు ఎస్.చలపతిరావు తెలిపారు. ఒంగోలులో బుధవారం ఈమేరకు వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31వతేదీ ఉదయం విప్లవకారునిగా, నాస్తికునిగా భగత్‌సింగ్ అనే అంశంపై తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం శాస్త్రీయ ఆలోచనా విధానం అంశంపై ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జయకుమార్ ప్రసంగిస్తారని, సభలో తత్వశాస్త్రం, గతితార్కిక భౌతికవాదం పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. ప్రగతిశీలవాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, స్టాలిన్, సత్యనారాయణ, సుశ్రత్, సుదర్శన్, రంగారెడ్డి, శ్రీనివాస్, జార్జి, సీహెచ్.సుధాకర్, పి.సుబ్బారావు, నాగేశ్వరరావు, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

78 బాటిళ్ల మద్యం పట్టివేత

- దుకాణం సేల్స్‌మెన్, కొనుగోలుదారుడు అరెస్టు

ఒంగోలు క్రైం, మార్చి 27: ప్రభుత్వ మద్యందుకాణం నుంచి బెల్ట్‌షాపునకు తరలిస్తున్న 78 మద్యం బాటిళ్లను ఎస్‌ఈబీ అధికారులు సీజ్ చేశారు. సేల్స్‌మెన్, బెల్టుషాప్ నిర్వాహకుడిని అరెస్టు చేశారు. బుధవారం ఒంగోలు నగరం కర్నూలురోడ్డులోని పవర్‌ఆఫీస్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణంలో బాలాజీరావుపేటకు చెందిన గంటా శేఖర్‌బాబు సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. వెంగముక్కపాలెం రోడ్డులో గల మదర్‌తెరిస్సా కాలనీకి చెందిన నత్తల అజయ్‌కుమార్‌కు 78 క్వార్టరు బాటిళ్లు విక్రయించాడు. బాటిల్‌కు అదనంగా రూ.10 తీసుకున్నాడు. ఈమేరకు సమాచారం తెలుసుకున్న ఎస్‌ఈబీ సీఐ సూర్యనారాయణ, ఎస్సై సీహెచ్.గీత తమ సిబ్బందితో వెళ్లి ఇరువురిని అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఇరువురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

నేడు బీజేపీ సమన్వయ కమిటీ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 27 : భారతీయ జనతా పార్టీ సమన్వయ కమిటీ సమావేశం గురువారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక భాగ్యనగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని మీడియా ఇన్‌చార్జి ధనిశెట్టి రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో విజయవాడలో జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో నిర్ణయాలపై చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్‌డీఏ కూటమి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని పేర్కొన్నారు. జిల్లా పదాధికారులు, మోర్చా, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆక్వాకల్చర్‌తో ఉపాధి : వీసీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీసీ అంజిరెడ్డి, అతిథులు

ఒంగోలు(విద్య), మార్చి 27: కోస్తా ప్రాంత గ్రామాల్లోని రైతులకు, వ్యవసాయ కూలీలకు, ఆక్వాకల్చర్ రంగంలో నిపుణులైన విద్యావంతులకు ఎంతోగానూ ఉపాధిని కల్పిస్తుందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని ఏకేయూ ఆడిటోరియంలో బుధవారం ఆక్వాకల్చర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సెమినార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రిజిస్ట్రార్ హరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో అంజిరెడ్డి మాట్లాడుతూ దేశంలో గుజరాత్‌రాష్ట్రం 1042 కిలోమీటర్ల తీర ప్రాంత విస్తీర్ణంలో ప్రథమ స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 972 కి.మీ. విస్తీర్ణంలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 56 మండలాలు ఉండగా తీర ప్రాంతం 50 కి.మీ. విస్తీర్ణంలో విరాజిల్లుతుందన్నారు. జిల్లాలో ఆక్వాకల్చర్ రంగంపై ఆధారపడి ఎంతో మంది జీవిస్తున్నారని తెలిపారు. ట్రెండ్స్ ఇన్ కల్చర్ అండ్ రోల్ ఆఫ్ కెమికల్స్ ఇన్ ఆక్వా కల్చర్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై ఒక రోజు జాతీయ స్థాయి సెమినార్‌ను నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన ఐసీఏఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎం.కైలాసం, కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, విభాగాధిపతులు సీహెచ్.వెంకటరాయులు, అవంతి ఆక్వా ఫీడ్స్ మేనేజర్ నరేంద్రబాబు, ఆక్వా ఇండియా కంపెనీ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహానికి ఏర్పాట్లు..అడ్డుకున్న అధికారులు

నాగులుప్పలపాడు, మార్చి 27 : బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. కనపర్తి పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో మైనర్ బాలికకు శుక్రవారం వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, టీచర్ కె.ముత్యాలమ్మ, వీఆర్వో భాగ్యారావు, గ్రామ మహిళా పోలీసు అనురాధ బాల్య వివాహన్ని అడ్డుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వైసీపీని ఓటుతో తరిమికొట్టాలి


కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

బాబు ష్యూరిటీ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింగయ్య

సింగరాయకొండ, మార్చి 27 : సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య పిలుపునిచ్చారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధి ఎస్సీకాలనీలో బుధవారం రాత్రి నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 సంవత్సరాల వయసు ఉన్న వారు ఇంట్లో ఎంతమంది ఉన్నా ఒక్కొక్కరికీ నెలకు రూ.1500 చెల్లిస్తామని చెప్పారు. తల్లికి వందనం కింద ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పారు. గ్రామాలు అభివృద్ధిబాటలో పయనించాలంటే టీడీపీ కూటమికి ఓటువేయాలని అభ్యర్థించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వేల్పుల వెంకట్రావు, బొడ్డు బాలకోటయ్య, పొనుగోటి శ్రీనివాసులు, శ్రీహరి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

కొండపి : టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాజాషా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పొదిలిరోడ్డు, కుమ్మరిపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, రైతులకు ఏటా రూ.20వేల సాయం తదితర గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కొండపి పట్టణ నాయకుడు నన్నూరి సుబ్బరామయ్య, నాయకులు అద్దేపల్లి శ్రీనివాసరావు, ఇజ్జిగిరి కాశయ్య పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

● 10 బాటిళ్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

టంగుటూరు, మార్చి 27 : మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మండలంలోని తూర్పునాయుడు పాలెంకు చెందిన గడ్డం శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు బుధవారం టంగుటూరు వచ్చి మద్యం కొనుగోలు చేశాడు. వాటితో తూర్పునాయుడుపాలెం చేరుకోగానే అప్పటికే అక్కడ ఉన్న పోలీసులు అతన్ని పట్టుకున్నారు. 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిని స్టేషన్‌కు తరలించారు.

వీరంగం సృష్టించిన కానిస్టేబుల్ వీఆర్‌కు

తర్లుపాడు, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి, ఫొటోగ్రాఫర్‌పై దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపినట్లు ఎస్సై వేముల సుధాకర్ తెలిపారు. ఆ మేరకు జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. సోమవారం అర్ధరాత్రి కలుజువ్వలపాడు నుంచి తర్లుపాడు వచ్చిన ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి, ఫొటోగ్రాఫర్ పోలీస్‌స్టేషన్‌లో కాలకృత్యాలు తీసుకునేందుకు వచ్చారు. వారిని ఎందుకు స్టేషన్‌కు వచ్చారంటూ బీట్ కానిస్టేబుల్ మద్యంసేవించి దుర్భాషలాడారు. దీంతో ఫోటోగ్రాఫర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్‌ను ఒంగోలు వీఆర్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు అందాయి.

అర్ధరాత్రి తోపుడు బండ్లు పంపిణీ

● వైసీపీ రంగులతో ఉన్న 14 బండ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న తోపుడు బండ్లు

ఒంగోలు (క్రైం), మార్చి 27 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ నగరంలోని రాంనగర్‌లో బుధవారం అర్ధరాత్రి వైసీపీ రంగులతో ఉన్న తోపుడు బండ్ల పంపిణీని ఆపార్టీ నాయకులు చేపట్టారు. దీనిపై సీవిజిల్‌కు ఫిర్యాదు అందింది. దీంతో ఎన్నికల అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రాంనగర్‌లో 8వ లైన్‌లో వైసీపీ రంగులతో ఉన్న 14 తోపుడు బండ్లను స్వాధీనం చేసుకున్నారు.

నర్సరాజుపాలెంలో వైసీపీకి ఎదురుదెబ్బ

● ఆ పార్టీని వీడి టీడీపీలో చేరిన 50 కుటుంబాలు ● సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే స్వామి, సత్య

మద్దిపాడు, మార్చి 27 : వైసీపీకి కంచుకోట అయిన నర్సరాజుపాలెం పంచాయతీలో ఆపార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన 50కుటుంబాల ఎస్సీలు, ఓసీలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి స్థానిక శాసనసభ్యుడు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ 2009 శాసన సభ ఎన్నికల నుంచి రేపు జరగబోయే ఎన్నికల వరకు టీడీపీ నుంచి తాను బరిలో నిలుస్తున్నానని, ప్రజల ఆదరాభిమానాలతో రెండుసార్లు విజయం సాధించానని చెప్పారు. ప్రత్యర్థి పార్టీ నుంచి ఎంతమంది అభ్యర్థులు మారినా తనపట్ల చూపిస్తున్న ఆదరణను జీవితాంతం మరువలేనన్నారు. రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రగా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఐదేళ్లగా నిలిచిపోయిన ప్రగతి మళ్లీ పరుగులు తీయాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమన్నారు. దారి,డొంక లేని పల్లెలకు తన హయాంలో శాశ్వతంగా రోడ్లను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో అలుపెరగకుండా జెండా మోస్తున్న ప్రతి ఒక్కరి రుణం తీర్చుకోలేమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, చదువుకునే ప్రతి విద్యార్థికి 20వేలు, బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమలులోకి తేవడం నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు భృతి అందించడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ గుట్లపల్లి ప్రసాద్, మల్లికార్జున, రవి, కొండలరావు, వీరనారాయణ, హరికృష్ణ, పాటిబండ్ల ఇమ్మానియెల్, చిన్న ఏసు, నాగేష్, ముద్దా ఏసు, చంద్రయ్య, సుబ్బయ్య ఆదాము, దానియేలుతోపాటు, చిమట గ్రామానికి చెందిన సాదం అప్పయ్య, సుధాకర్‌లు పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, రేగుల వీరనారాయణ, మోహన్‌రావు, నరసింహారెడ్డి, గురుబ్రహ్మం, హనుమారెడ్డి, కోటిరెడ్డి, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.


నర్సరాజుపాలెం టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

ఎన్నికల నిబంధనలను విధిగా పాటించాలి

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

సింగరాయకొండ, మార్చి 27 : ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని సీఐ దాచేపల్లి రంగనాథ్ సూచించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన బింగినపల్లి, పెదబోయినవారి పాలెం, ఊళ్లపాలెం, దేవళంపల్లెపాలెం, బేసిన్ పల్లెపాలెంలో బుధవారం బీఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు హక్కును ఓటర్లు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈసీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై టి.శ్రీరామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

కేంద్ర బలగాల కవాతు

కొండపి : నియోజకవర్గ కేంద్రమైన కొండపితోపాటు పెట్లూరు, పెదకండ్లగుంట గ్రామాల్లో కేంద్ర బలగాలు బుధవారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ పాండురంగారావు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో 144వ సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎవరైనా ఎన్నికల విధులకు ఆటంకం కల్గించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొండపి, పొన్నలూరు, మద్దిపాడు ఎస్సైలు కృష్ణబాజీబాబు, రాజేష్, బసవరాజు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

యథేచ్ఛగా సిట్టింగ్ రూంలు



కంభంలో మద్యం దుకాణం పక్కన ఉన్న సిట్టింగ్ రూం

కంభం, మార్చి 27 : పట్టణంలో రద్దీగా ఉండే ఆర్టీసి బస్టాండ్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు, పక్కనే అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన సిట్టింగ్ రూములు, ఓ సినిమా హాలు సమీపంలో మరో ప్రభుత్వ మద్యం దుకాణం, దాని పక్కనే 3 సిట్టింగ్ రూములు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. దీంతో నిత్యం మందుబాబుల కోలాహలంతో ఆదారిన పోయే ప్రయాణికులకు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణాలు మూసివేసే సమయంలో 2, 3 కేసుల మద్యం బాటిళ్లను సిట్టింగ్ రూములకు పంపించి మరుసటి రోజు తెల్లవారుజామునే సిట్టింగ్ రూముల్లో అధిక రేట్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ రూంలు నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకున్న దాఖాలాలు లేవు. దీనిపై ఎస్ఈబీ డీఎస్పీ దుర్గాప్రసాద్ స్పందిస్తూ, అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహించడం నేరమన్నారు. సిబ్బందితో దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.

వలసలతో టీడీపీలో నూతనోత్సాహం



వై.పాలెంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

పుల్లలచెరువు, మార్చి 27: నియోజవర్గంలో టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతుంది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుదూరి ఎరిక్షన్ బాబు పార్టీ కార్యక్రమాల్లో దుసుకెళ్తున్నారు. నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి రోజుకో మండలం నుంచి పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో ఎర్రగొండపాలెం మండలంలోని యల్లరెడ్డిపల్లె నుంచి 25 కుటుంబాలు, గంజివారిపల్లె నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలను గాలికి వదిలేశారన్నారు. కనీసం మంచినీటి సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. వైసీపీ పాలనలో దాచుకోవడం దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, నాయకులు చిట్యాల వెంగల్‌రెడ్డి, అంజయ్య, మంత్రునాయక్, ఆదిరెడ్డి,బాలకోటయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతోపాటు పోటీ పరీక్షలు అవసరం

మార్కాపురం వన్ టౌన్, మార్చి 27: విద్యార్థులకు చదువుతోపాటు పోటీ పరీక్షలు అవసర మని ఎంఈవో బి.రాందాస్‌నాయక్ అన్నారు. స్థానిక సాయి బాలాజీ ఉన్నత పాఠశాలలో 'నీడ్ అండ్ డీడ్' సంస్థ విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర విద్యార్థి దశలో ఉపాధ్యాయ పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి మరో ఎంఈవో దుంబేటి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సూచనలు పాటించి నాణ్యమైన విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రకాశ్‌రావు, ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలిలు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

అవీ..ఇవీ..

లోగ్రేడ్‌కు గిట్టుబాటు ధరలు

● కిలో రూ.220కి కొనుగోలు


కొనసాగుతున్న పొగాకు వేలం

టంగుటూరు, మార్చి 27 : లోగ్రేడ్ పొగాకుకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. కిలోకు రూ.220 చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ ధరలు ఎంత కాలం కొనసాగుతాయోనని రైతులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం పొగాకు ఎగుమతి కంపెనీల వారికి లోగ్రేడ్లకు డిమాండ్ ఉన్న కారణంగానే ధరలు రైతులకు అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. వ్యాపారులకు సరిపడా నిల్వలు చేరగానే పరిస్థితి ఎలా ఉంటుందోనని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. పరిస్థితిని అర్థం చేసుకొని సాఫ్, హీట్‌లతో కూడిన బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురావద్దని సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సూచించారు. లోగ్రేడ్లు తెచ్చుకొని అమ్ముకోవాలని కోరారు. అలాగే పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బుధవారం వేలం కేంద్రానికి కె.ఉప్పలపాడు రైతులకు చెందిన 964 పొగాకు బేళ్లను అనుమతించగా అందులో 875 బేళ్ల కొనుగోలు జరిగింది. 89 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. వేలంలో 19 వ్యాపార కంపెనీలు పాల్గొన్నాయి. గరిష్ఠ ధర కిలోకు రూ.231, కనిష్ఠ ధర రూ.220 లభించింది. సరాసరి ధర కిలోకు రూ.228.51 దక్కింది.

నేడు టీడీపీ ఆత్మీయ సమావేశాలు

సింగరాయకొండ, మార్చి 27 : మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సమావేశాలు జరగనున్నాయి. పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి, మూలగుంటపాడుల్లో వీటిని ఏర్పాటు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సత్య హాజరై సార్వత్రిక ఎన్నికలపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు.

శాస్త్రోక్తంగా పాతధ్వజస్తంభం అష్టదిక్పాలక పీఠం తొలగింపు


ధ్వజానికి నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 25: మార్కాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల కోసం పలు కార్యక్రమాలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారి అనుజ్ఞ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పాత ధ్వజానికి పంచామృతాలతో షోడశ ఉపచార పూజలు, ప్రాయచిత్త హోమం, బాలాలయం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాతధ్వజం అష్టదిక్పాలుకల పీఠం తొలగించారు. ఈ కార్యక్రమంలో ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైసీపీ సేవలో వలంటీర్

పుల్లలచెరువు, మార్చి 27 : మండలంలోని ఐటీవరం సచివాలయం-2 పరిధిలో నిలువురాళ్ల కాలనీలో వలంటీరుగా పనిచేసున్న వలంటీర్ ఆర్.రాముడు నాయక్ వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్నారు.. బుధవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైసీపీలో చేరిన కార్యక్రమంలో వారికి కండువాలు వేయించారు. ఇప్పటికే కోడ్ ఉల్లంఘించిన మురికిమల్ల తాండలో వలంటీరును అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే.

సబ్‌జైలులో న్యాయాధికారి తనిఖీ

● ఖైదీల సదుపాయాలపై విచారణ


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి

గిద్దలూరు టౌన్, మార్చి 27 : పట్టణం లోని క్లబ్ రోడ్డులోని సబ్‌జైలును బుధ వారం అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి. మేరీసారాదానమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో సబ్‌జైలులో పదిమంది ఖైదీలు ఉండగా వారికి అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే తప్పులకు శిక్షను అనుభవించాల్సి వస్తోందన్నారు. మీ వల్ల కుటుంబసభ్యులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఇకమీదట ఇలాంటి తప్పులు చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వారు ఎదుర్కొనే కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేనివారికి ఉచితంగా న్యాయవాదిని కోర్టు ద్వారా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది సి.హెచ్.పోలయ్య, జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, పారాలీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

● మార్కాపురంలో వెలుగు ఆధ్వర్యంలో ర్యాలీ ● త్రిపురాంతకంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



మార్కాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వెలుగు అధికారులు

మార్కాపురం రూరల్, మార్చి 27 : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వైకేపీ ఏపీఎం రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని ఎస్వీబీసీ కాలనీలోని వైకేపీ కార్యాలయం వద్ద ఓటుహక్కుపై గ్రామంలోని మహిళలు అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంతంలో మహిళలతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీసీలు మనోకుమారి, స్వామి, అకౌంటెంట్, వీవోఏలు, స్వయంసహాయక సంఘ మహిళలు పాల్గొన్నారు.

గిద్దలూరు, మార్చి 27 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలని గిద్దలూరు రూరల్ సీఐ దాసరి ప్రసాద్ సూచించారు. రాచర్ల పోలీసుస్టేషన్‌లో ఆయన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, వ్యక్తిగత ప్రచారాలు, ఇంటింటి ప్రచారాలు చేయాలంటే తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా ప్రచారం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రజలకు సహకరించాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పొదిలి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల నేతలు ఎన్నికలకోడ్ ఉల్లంగిస్తే చట్టపర మైనచర్యలు తప్పవని సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికలకోడ్ అమలులో ఉందని ప్రతిరోజు గ్రామాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా వాట్సఅప్‌లలో వచ్చే సందేశాలను ప్రజలు పూర్తిగా చదివిన తరువాత ఇబ్బందులు తలెత్తవు అనుకుంటేనే పోస్ట్ చేయాలన్నారు. అర్థం తెలియకుండా పోస్ట్ చేసి వివాదాలకు కారణం కాకూడదన్నారు. రాజకీయంగా వ్యక్తులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం, పోస్టులు పెట్టడం చేయకూడదన్నారు. అలా చేయడాన్ని నేరంగా పరిగణిస్తామన్నారు. రౌడీషీటర్లతో పాటు గత ఎన్నికల్లో ఘర్షణలకు కారణమైన వారిని కూడా బైండోవర్ చేస్తామన్నారు. సమస్యాత్మక గ్రామాల పై ప్రత్యేక దృష్టిపెట్టి ఇరువర్గాల వారికి కొన్ని సూచనలు చేశామన్నారు. గ్రామా ల్లో ఏమైనా ఘటనలు జరిగినా, సమస్యలు ఉన్నా వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఎవరి ఓటు వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కోటయ్య ఉన్నారు.

పెద్దదోర్నాల : ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని డీటీడబ్ల్యువో జగన్నాథ రావు అన్నారు. మండలంలోని చింతల, మర్రిపా లెం గిరిజన గ్రామాల్లో ఓటుహక్కుపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన అవగాహన సదస్సులో భాగంగా డీటీడబ్ల్యువో జగన్నాథరావు మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలన్నారు. ఓటర్లందరూ ఓటు వేయాలన్నారు. అయితే ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. అనంతరం స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ హార్టికల్చర్ డైరక్టర్ ధనుంజయ, జిల్లా లేబర్ అధికారి భూపాల్, నోడల్ అధికారి శ్రీనివాసరావు, ఎంఈవో కొండలరావు, ఆర్‌వోఎఫ్ఆర్ కోఆర్డినేటర్ మంతన్న, టీఏ లాల్ అహ్మద్ హెచ్‌ఎం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



త్రిపురాంతకంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఎన్నికల కోడ్‌పై అవగాహన

త్రిపురాంతకం : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న ఎన్నికల కోడ్‌పై అవగాహనా కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ బి.రామకృష్ణ శివప్రసాద్, ఎంపీడీవో ఎం.సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, గ్రామాల్లో అన్ని రకాల పరిస్థితులపై ప్రతి ఒక్క అధికారీ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయపార్టీల ప్రచారాల్లో సౌండ్ బాక్సులు వినియోగించకూడదని, ర్యాలీలు చేయాలంటే అనుమతులు తీసుకోవాలని అన్నారు. ఎక్కడా ప్లెక్సీలు, జండాలు ఉండకూడదని తెలిపారు. ఎస్సై సాంబశివయ్య మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కవ్వింపు చర్యలకు పాల్పడే వారిపై దృష్టి సారించాలని సిబ్బందికి మహిళా పోలీసులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎస్.మురళీమోహన్, ఎంఈవో రాజశేఖర రెడ్డి, వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

చదువుతోపాటు పోటీ పరీక్షలు అవసరం



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 27: విద్యార్థులకు చదువుతోపాటు పోటీ పరీక్షలు అవసరమని ఎంఈవో బి.రాందాస్‌నాయక్ అన్నారు. స్థానిక సాయి బాలాజీ ఉన్నత పాఠశాలలో 'నీడ్ అండ్ డీడ్' సంస్థ విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర విద్యార్థి దశలో ఉపాధ్యాయ పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించి మరో ఎంఈవో దుంబేటి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సూచనలు పాటించి నాణ్యమైన విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రకాశ్‌రావు, ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్ వలిలు పాల్గొన్నారు.

బంగారుహారం అందజేత



హారాన్ని అందిస్తున్న దాత కుటుంబీకులు

గిద్దలూరు, మార్చి 27 : పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి దివంగత ముప్పూరి వెంకట సుబ్బయ్య (ధర్మరాజు), భార్య విజయలక్ష్మి రూ.1.60 లక్షల విలువైన బంగారుహారాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ హారాన్ని ఆమె కుమారు లైన ముప్పూరి జ్యువెలర్స్ యజమానులు దేవస్థాన కమిటీ కోశాధికారి నరసింహారావుకు అందజేశారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

త్రిపురాంతకం, మార్చి 27: మండలంలోని ఐదు కేంద్రాలలో నిర్వహిస్తున్న పదోతరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. కాగా ఐదు పరీక్షా కేంద్రాలలో బుధవారం మొత్తం 29 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. త్రిపురాంతకం జడ్పీ పాఠశాలలో(ఏ) కేంద్రంలో 194 మంది విద్యార్థులకు 180 మంది, బి కేంద్రంలో 131 కి 123 మంది హాజరయ్యారు, గణపవరం గురుకుల పాఠశాలలో 140 కి 139 మంది విద్యార్థులు, దూపాడు బాలికల గురుకుల పాఠశాలలో 141కి 137 మంది, మేడపి జడ్పీ పాఠశాల కేంద్రంలో 96 మందికి 94 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కాగా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేలం కేంద్రాన్ని పరిశీలించిన చైర్మన్



కొనుగోళ్లను పరిశీలిస్తున్న చైర్మన్

పొదిలి, మార్చి 27 : పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని చైర్మన్ సీహెచ్ యశ్వంత్ బుధవారం పరిశీలించారు. వేలం కేంద్రంలో జరుగుతున్న అమ్మకాలను ఆయన పరిశీలించి ధరలను వాకబు చేశారు. వ్యాపారు లు ఎలాంటి రకం పొగాకును ఎక్కువ కొనుగోలు చేస్తున్నారు ఏ పొగాకుకు ఎంత ధర నిర్ణయిస్తున్నా రో పరిశీలించారు. అనంతరం రైతుల తో మాట్లాడారు. వ్యాపారులు సీలింగ్ పెట్టుకొని రూ.230 ధరను ఇస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వ్యాపారులు కొనుగోలు చేసే నాణ్యమైన పొగాకును వేలానికి తీసుకువస్తే మంచి ధర వచ్చే అవకాశం ఉంటుందని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఎస్ గిరిరాజ్‌కుమార్, ఎస్‌జీవో కిరణ్‌లు ఉన్నారు.

శాస్త్రోక్తంగా పాతధ్వజస్తంభం అష్టదిక్పాలక పీఠం తొలగింపు



ధ్వజానికి నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 25: మార్కాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల కోసం పలు కార్యక్రమాలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారి అనుజ్ఞ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పాత ధ్వజానికి పంచామృతాలతో షోడశ ఉపచార పూజలు, ప్రాయచిత్త హోమం, బాలాలయం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా పాతధ్వజం అష్టదిక్పాలుకల పీఠం తొలగించారు. ఈ కార్యక్రమంలో ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మార్కాపురం రూరల్, మార్చి 27: పట్టణంలోని పదో వార్డులో అక్రమంగా అమ్ముతున్న 13 మద్యం సీసాలను టూ టౌన్ ఎస్ఐ సువర్ణ స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం తెలిపారు. ఇంట్లో విక్రయం కోసం నిల్వ ఉంచిన కాశీం అనే వ్యక్తి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

వైసీపీ సేవలో వలంటీర్

పుల్లలచెరువు, మార్చి 27 : మండలంలోని ఐటీవరం సచివాలయం-2 పరిధిలో నిలువురాళ్ల కాలనీలో వలంటీరుగా పనిచేసున్న వలంటీర్ ఆర్.రాముడు నాయక్ వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం ఎర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైసీపీలో చేరిన కార్యక్రమంలో వారికి కండువాలు వేయించారు. ఇప్పటికే కోడ్ ఉల్లంఘించిన మురికిమల్ల తాండలో వలంటీరును అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే.

సబ్‌జైలులో న్యాయాధికారి ఆకస్మిక తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి

గిద్దలూరు టౌన్, మార్చి 27 : పట్టణం లోని క్లబ్ రోడ్డులోని సబ్‌జైలును బుధవారం అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి. మేరీసారాదానమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో సబ్‌జైలులో పదిమంది ఖైదీలు ఉండగా వారికి అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే తప్పులకు శిక్షను అనుభవించాల్సి వస్తోందన్నారు. మీ వల్ల కుటుంబసభ్యులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఇకమీదట ఇలాంటి తప్పులు చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వారు ఎదుర్కొనే కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేనివారికి ఉచితంగా న్యాయవాదిని కోర్టు ద్వారా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది సి.హెచ్.పోలయ్య, జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, పారాలీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

గూడ్స్‌రైలు ఢీకొని వ్యక్తి మృతి

మార్కాపురం రూరల్, మార్చి 27: మండలంలోని భూపతిపల్లి రైల్వేగేటు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన వెలుగు చూసింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతి చెందిన వ్యక్తి 40 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి ఉండవచ్చన్నారు. మృతుడు తెల్లని చొక్కా మాత్రమే ధరించి ఉన్నాడని, నల్లని జుట్టు, నల్లని గడ్డంతో ఉన్నారన్నారు. మృతునికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే మార్కాపురం రైల్వే పోలీసులకు 7702650514 ఫోన్ నంబరుకు తెలియజేయాలని కోరారు. ఘటనా స్థలాన్ని మార్కాపురం రైల్వే ఏఎస్ఐ ఎ.వెంకట్రావు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష, నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడికి గాయాలు

● ద్విచక్ర వాహనాన్ని పందులు ఢీకొనడంతో ఘటన

మార్కాపురం రూరల్, మార్చి 27: రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడికి గాయాలైన ఘటన మండలంలోని చింతకుంట గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్యనాయకుడు చల్లా రామిరెడ్డి తన పొలానికి బుధవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యలో పొలాలలో నుంచి ఒక్కసారిగా అడవి పందులు అడ్డువచ్చాయి. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా అదుపుతప్పి బైకు ఆయన మీద పడింది. దీంతో చాతి, భుజం, తలపై తీవ్రగయాలయ్యాయి. వైద్యం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట వైద్యశాలకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

వీరంగం సృష్టించిన కానిస్టేబుల్ వీఆర్‌కు

తర్లుపాడు, మార్చి 27: సార్వత్రిక ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి, ఫోటోగ్రాఫర్‌పై దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపినట్లు ఎస్సై వేముల సుధాకర్ తెలిపారు. ఆ మేరకు జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. సోమవారం అర్ధరాత్రి కలుజువ్వలపాడు నుంచి తర్లుపాడు వచ్చిన ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి, ఫొటోగ్రాఫర్ పోలీస్‌స్టేషన్‌లో కాలకృత్యాలు తీసుకునేందుకు వచ్చారు. వారిని ఎందుకు స్టేషన్‌కు వచ్చారంటూ బీట్ కానిస్టేబుల్ మద్యంసేవించి దుర్భాషలాడారు. దీంతో ఫోటోగ్రాఫర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్‌ను ఒంగోలు వీఆర్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు అందాయి.

గాయపడ్డ దుప్పికి చికిత్స

గిద్దలూరు టౌన్, మార్చి 27 : ప్రమాదవశాత్తు గాయపడిన దుప్పికి అధికారులు బుధవారం చికిత్స అందించారు. దిగువమెట్ట రైల్వేస్టేషన్ సమీపంలో చుక్కలదుప్పి గాయపడి కదలలేని స్థితిలో ఉంది. సమాచారం అందుకున్న దిగువమెట్ట అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వంశీకృష్ణ ఘటన స్థలానికి చేరుకొన్నారు. గాయపడిన దుప్పిని కెఎస్‌పల్లి వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ రంగస్వామి, గోపాలమిత్ర రామాంజనేయులు సహకారంతో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం చుక్కల దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. ఆరోగ్యంగా దుప్పి అడవిలోకి వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో కయామ్, చెక్‌పోస్టు హెల్పర్ సుందర్‌రాజు, స్వచ్ఛ సేవకులు సురేంద్ర, రమణ ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

● కుటుంబ కలహాల నేపథ్యంలో ఘటన

గిద్దలూరు టౌన్, మార్చి 27 : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఇంటిలోనే ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం గిద్దలూరు పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని పూసలబజారులో పాస్టర్‌గా పని చేస్తున్న మరియకుమార్, విజయలలిత (25) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల వీరి మధ్య కలహాల నేపథ్యంలో తరచూ ఘర్షణలకు దిగేవారు. బుధవారం కూడా ఘర్షణ పడడంతో భార్య విజయలలిత ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరకట్టుకొని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఇంటికి వచ్చిన భర్త మరియకుమార్, స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వీరసోమయ్య ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

గిద్దలూరు టౌన్, మార్చి 27 : రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతిచెందిన ఘటన గిద్దలూరు మండలం బురుజుపల్లె-ముండ్లపాడు మధ్య బుధవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తకోట గ్రామంలో చిల్లరకొట్టు నిర్వహిస్తున్న పుల్లయ్య (64) రోడ్డుమీద వెళుతుండగా, వెనుక నుంచి గుర్తు తెలియని కారు వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ గిద్దలూరు అర్బన్ సీఐ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

వలసలతో టీడీపీలో నూతనోత్సాహం



వై.పాలెంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

పుల్లలచెరువు, మార్చి 27: నియోజవర్గంలో టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతుంది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడూరి ఎరిక్షన్ బాబు పార్టీ కార్యక్రమాల్లో దుసుకెళ్తున్నారు. నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి రోజుకో మండలం నుంచి పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం ఎర్రగొండపాలెం లోని టీడీపీ కార్యాలయంలో ఎర్రగొండపాలెం మండలంలోని యల్లారెడ్డిపల్లె నుంచి 25 కుటుంబాలు, గంజివారిపల్లె నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలను గాలికి వదిలేశారన్నారు. కనీసం మంచినీటి సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. వైసీపీ పాలనలో దాచుకోవడం దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, నాయకులు చిట్యాల వెంగల్‌రెడ్డి, అంజయ్య, మంత్రునాయక్, ఆదిరెడ్డి బాలకోటయ్య ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం, అభ్యున్నతి

జయహో బీసీ సభలో కందుల రామిరెడ్డి

తర్లుపాడు, మార్చి 27: బీసీల అభ్యున్నతికి టీడీపీ అండ అని మార్కాపురం నియోజకవర్గ ఫ్లోర్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి అన్నారు. మండలంంలోని కేతగుడిపి పంచాయతీ బుడ్డపల్లెలో జయహో బీసీ కార్యక్రమం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల రామిరెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. వారి అభివృద్ధికి కృషి చేసిందన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. బీసీలకు గతంలో ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రస్తుతం ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బీసీలకు రక్షణ చట్టం అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు బీసీలంద రూ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.

30 కుటుంబాల చేరిక

బుడ్డపల్లె గ్రామంలోని 30 బీసీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కందుల రామిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అంగిరేకుల చిన్నోడు, అంగిరేకుల కాశయ్య, లోలా శ్రీను, పొడతరపు ఏడుకొండలు, తమ్మిశెట్టి లూథియా, తమ్మిశెట్టి వెంకటలక్ష్మమ్మ, బండారు వెంకటరత్నం, బండారు వెంకట రమణ, బండారు అల్లూరయ్య, ఏరువ మాలకొండయ్య, అంగిరేకుల నాగయ్య, తమ్మిశెట్టి భాగ్యలక్ష్మీ, వేల్పుల శీను, బాల కోటయ్యలు వారి అనుచర వర్గంతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పులి వేముల ఏసుదాసు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి బాసపతిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి కంచెర్ల కాశయ్య, నంబుల లక్ష్మయ్య, నాలి కొండయ్య, మందా వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన బీసీ కుటుంబాలు

బీసీల పక్షపాతి టీడీపీ

పెద్ద దోర్నాల : ఆది నుంచీ టీడీపీ బీసీల పక్షపాతియని ఆ పార్టీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు షేక్ మాబు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, బూతు స్థాయి నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు.మండల కన్వీనర్ ఏర్వ మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాబు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్‌లో భాగంగా బీసీల రక్షణ చట్టం అమలు చేయడంతో పాటు 50 ఏండ్లు నిండిన మహిళలకు పింఛను మంజూరు, వివాహకానుకగా లక్ష రూపాయలు అమలు, చంద్రన్న బీమాలో భాగంగా పదిలక్షలు అందజేత, శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అంతేగాక ప్రతి మండలంలో కమ్యూనిటీ భవనాలు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.పాత పథకాలు కొనసాగించనున్నట్లు చెప్పారు. ఈ పథకాలను భూతు స్థాయి కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని అన్నారు. కూటమి విజయమే ఆలంబనగా ఐక్యతతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ భాష, ఇస్మాయిల్, జనసేన అధ్యక్షులు మురళిప్రసాద్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా సిట్టింగ్ రూంలు

కంభం, మార్చి 27 : పట్టణంలో రద్దీగా ఉండే ఆర్టీసి బస్టాండ్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు, పక్కనే అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన సిట్టింగ్ రూములు, ఓ సినిమా హాలు సమీపంలో మరో ప్రభుత్వ మద్యం దుకాణం, దాని పక్కనే 3 సిట్టింగ్ రూములు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. దీంతో నిత్యం మందుబాబుల కోలాహలంతో ఆదారిన పోయే ప్రయాణికులకు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యం దుకాణాలు మూసివేసే సమయంలో 2, 3 కేసుల మద్యం బాటిళ్లను సిట్టింగ్ రూములకు పంపించి మరుసటి రోజు తెల్లవారుజామునే సిట్టింగ్ రూముల్లో అధిక రేట్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్ రూంలు నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనిపై ఎస్ఈబీ డీఎస్పీ దుర్గాప్రసాద్ స్పందిస్తూ, అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహించడం నేరమన్నారు. సిబ్బందితో దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు.



కంభం మద్యం దుకాణం పక్కన ఉన్న సిట్టింగ్ రూం

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే ఉమ్మడి పోరు

● టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ● మద్దతు తెలిపిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

గిద్దలూరు టౌన్, మార్చి 27 : రాష్ట్రంలో ప్రజాసంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడిగా ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి తెలియజేయాలని గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం నందు గిద్దలూరు, రాచర్ల, కొమరోలు టీడీపీ యూనిట్, బూత్ ఇన్‌చార్జులతోపాటు ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి టీడీపీ కార్యకర్త రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనలో నెలకొన్న అరాచక పాలనను ప్రజలకు వివరించాలన్నారు. నాడు టీడీపీలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికి వివరించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, మహిళ సంక్షేమం, రైతుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ సైనికులాగా పని చేసి తన గెలుపుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : మాయమాటలు చెప్పి మాదిగలను జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశాడని, జగన్‌ను చిత్తుగా ఓడించాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజుమాదిగ అన్నారు. బుధవారం మున్నంగి నాగరాజుమాదిగ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిశారు. ఆయనతోపాటు మాదిగ సంఘం నాయకులు కూడా కలిసి చంద్రబాబు గెలుపే మాదిగలకు మలుపని, అన్నారు. ఎన్‌డీఏ కూటమి బలపరచిన ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపు కోసం తామంతా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మాదిగజాతి ప్రయోజనాలను కాపాడేవారికి అండగా ఉంటామన్నారు. ఇటీవల ఎంఆర్‌పిఎస్ నాయకులు మందక్రిష్ణమాదిగ, ప్రతినిధుల బృందం చంద్రబాబు నాయుడును కలిసి కొన్ని డిమాండ్లు ముందు ఉంచిందన్నారు. వర్గీకరణ అంశంపై సహకరించాలన్నదే ప్రధాన డిమాండ్ అని చంద్రబాబుతో పేర్కొనడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఎంఆర్‌పీఎస్ ఉద్యమకారులకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పిస్తామని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలిపారు. అశోక్‌రెడ్డికే మాదిగల ఓట్లు వేస్తామని నాగరాజు తెలిపారు. నియోజకవర్గంలోని దాదాపు 25వేల మంది మాదిగల ఓట్లు అశోక్‌రెడ్డికి వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు వర్గీకరణ అనేది నాన్న గారి కోరిక అని, అధికారంలోకి రాగానే వర్గీకరణ సమస్యకు అనుకూలంగా తీర్మానం చేస్తామని చెప్పిన జగన్ మాట మార్చారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను చిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి జలదంకి నరసింగారావు, రాష్ట్ర కార్యదర్శి పుల్లుగుజ్జు ఫ్రాంక్లిన్‌మాదిగ, జిల్లా అధ్యక్షులు తొరటి ఆనంద్‌మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదిమూలపు ప్రకాశ్ మాదిగ, సీనియర్ నాయకులు గుర్రం దానియేలుమాదిగ, చిట్టెం ఆరోగ్యం మాదిగ, మండల అధ్యక్షులు కొమ్మునూరి వెంకటేష్‌మాదిగ, ఓబయ్యమాదిగ, ప్రసాద్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ముత్తుములకు సంఘీభావం తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

నేను స్థానికుడిని...

గిద్దలూరు టౌన్ : 'నేను స్థానికుడిని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా, నన్ను ఆశీర్వదించండి, మీ రుణం తీర్చుకుంటా' అని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి అర్ధవీడు మండలం వెలగలపాయ గ్రామానికి చెందిన 100 కుటుంబాలు ఎంపీపీ ఎం.వెంకటరావు ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు టీడీపీ పట్ల ప్రజలకు నమ్మకం పెరిగి టీడీపీలో చేరుతున్నారన్నారు. వారికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో జె.రామలింగేశ్వరరావు, కె.జయచంద్రగౌడ్, కె.వెంకటరావు, ఎ.శ్రీను, ఎస్.ప్రసాద్, ఎం.మహేష్, కె.వెంకటేష్, కె.అనీల్, జె.వెంకటేశ్వర్లు, బోగోలు వార్డు సభ్యులు కొండా రమణరెడ్డి పార్టీలో చేరగా కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గిద్దలూరులో టీడీపీలో చేరిన వారితో అశోక్‌రెడ్డి

20 మద్యం బాటిళ్లు పట్టివేత


మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఐ

పామూరు, మార్చి 27 : జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సీఎస్‌పురం మండలంలోని పలు చోట్ల తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి నుంచి అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులో తీసుకొన్నట్లు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండలంలో ఎవరైన అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

నీటిఎద్దడి సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మరమ్మత్తులు చేపట్టిన డీప్ బోరు మోటర్

తాళ్లూరు, మార్చి 27 : మండలంలోని దోసకాయలపాడుఎస్సీ కాలనీవాసుల నీటి ఎద్దడికి అధికారులు బుధవారం పరిష్కారం చూపారు. కాలనీ కోసం ఏర్పాటు చేసిన డీప్ బోర్‌కు మరమ్మతులు జరిపించారు. ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి అనే కథనంతో దోసకాయలపాడు ఎస్సీ కాలనీవాసులు రెండు నెలలుగా ఎదుర్కొంటున్న నీటి సమస్యపై బుధవారం ఆంధ్రజ్యోతితో వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఈవోఆర్డీ కేజీఎస్ రాజు, గ్రామ సర్పంచ్ శివలక్ష్మి ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన మోటార్‌కు మరమ్మతులు జరిపించి బిగించారు. కాలనీలోని అన్ని వీధులకు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టారు.

భైరవకోనలో చీఫ్ సెక్రటరీ వళవన్ పూజలు


చీఫ్ సెక్రటరీ వళవన్‌ను సన్మానిస్తున్న కమిటీ

పామూరు, మార్చి 27 : సీఎస్‌పురం మండలం భైరవకోనలోని శ్రీ భైరవేశ్వరస్వామిని, త్రిముఖ దుర్గాదేవి అమ్మవారిని, నగరేశ్వరస్వామిలను దేవదాయ ధర్మదాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాళవళవన్ బుధవారం దర్శించుకొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం వళవన్‌ను ఘనంగా ఆహ్వానించి అభిషేకం పూజలు, కుంకుమార్చనపూజలు చేయించారు. శేషవస్త్రాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న మెగా అభిమానులు

కనిగిరి, మార్చి 27 : సేవా కార్యక్రమాలను నిర్వహించటంలో తమకు అభిమాన నటుడే ఆదర్శమని మెగాస్టార్ అభిమానులు తెలిపారు. సినీనటుడు మెగాస్టార్ తనయుడు హీరో రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక గార్లపేట రోడ్డులోని వాసవీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా చరణ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మెగా అభిమానులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు బాషా, అంజినాయుడు, ఖాజా, ప్రవీణ్, ఖాదర్, శశి పాల్గొన్నారు.

దర్శిలో ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న గోరంట్ల రవికుమార్, పాపారావు తదితరులు

దర్శి, మార్చి 27 : సినీ హిరో మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో ఆయన ఎన్నో రికార్డులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు అడుసుమల్లి వెంకటరావు, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు రాజేష్, తెలుగు మహిళ అధికార ప్రతినిధి శోభారాణి, జనసేన పార్టీ నాయకులు సీహెచ్ కొండయ్య, పసుపులేటి చిరంజీవి, కుప్పాల రుద్ర మాదా శేషయ్య, గుండాల ప్రసాద్, కె. ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళాశక్తి, సూపర్ సిక్స్ పథకాలతో ఆర్థిక భరోసా


పత్రాలను పంపిణీ చేస్తున్న ఉగ్ర సోల్జర్ బృందం సభ్యులు

పామూరు, మార్చి 27 : టీడీపీ మినీ మేనిఫెస్టోను టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మహిళాశక్తి సూపర్‌సిక్స్ పథకాల అమలుతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని ఉగ్ర సోల్జర్ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం పామూరులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలకు సంబంధించి ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాసిన్, షకీల్ పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుర ఆచూకీ లభ్యం!

విజయవాడలో గుర్తించిన పోలీసులు

కనిగిరి, మార్చి 27 : తప్పించుకుని పారిపోయిన ఇద్దరు విద్యార్థులు ఆచూకీ బుధవారం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... కనిగిరి పట్టణ సమీపంలోని కేటీఆర్ స్కూల్‌లో కాకర్ల అవినాష్, షేక్ కరిముల్లా అనే విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వారు మంగళవారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి తప్పించుకుపోయిన విషయం పాఠకులకు విదితమే. ఈ మేరకు స్కూలు యాజమాన్యం, విద్యార్థుల తల్లితండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ త్యాగరాజు తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. వీరిరువు విజయవాడలోని నున్నా పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానంగా సంచరిస్తుండగా అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కనిగిరి ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ సమాచారాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా ఎస్ఐ త్యాగరాజు విద్యార్థుల తల్లితండ్రులతో పాటు సిబ్బందిని విజయవాడ పంపించి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

జగన్‌ను గద్దె దించటమే జనం అజెండా

టీడీపీ పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్

కనిగిరి, హెచ్ఎంపాడు మండలాల్లో సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం

కనిగిరి, మార్చి 27 : జగన్‌ను గద్దె దించడమే జనం అజెండా అని పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ చెప్పారు. పట్టణంలోని 18వ వార్డులో టీడీపీ పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాలపై, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు, రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ ఫిరోజ్ మాట్లాడుతూ జగన్ బూటకపు పాలనపై గొంతెత్తే వారిపై కేసులు పెట్టించి, దాడులు చేయించి ప్రాణాలు కూడా తీసేందుకు వెనుకాడడం


గాయంవారిపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు


కనిగిరిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నేతలు, తెలుగుమహిళలు

లేదన్నారు. టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఓటరూ సంకల్ప సిద్ధులవ్వాలని చెప్పారు. కనిగిరి ప్రాంతాభివృద్ధికి అహర్నిశలు పాటుపడే డాక్టర్ ఉగ్రను గెలిపించుకుంటేనే నిమ్జ్, ఇంటింటికీ తాగునీరు ఏర్పాటు చేయిస్తారన్నారు. వెలిగొండ జలాలతో బీడు భూములన్నీ సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీ నారాయణ, మాజీ కోఆప్షన్ షరీఫ్, షేక్ బారాయిమాం, గండికోట రమేష్, మారుతీగుప్తా, ఓలేటి చిన్నా, రాచమల్ల చినశ్రీనివాసరెడ్డి, కొట్టే ప్రసాద్, ఆసుల వెంకటేశ్వర్లు, నరసింహ, తిరుపాలు, రిజ్వాన్, చిలకపాటి లక్ష్మయ్య, షేక్ నజిముద్దీన్, తెలుగుమహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్ వాజిదాబేగం, బొగ్గరపు శ్రీలత, తులసి, దొరసాని, నారాయణమ్మ, అమ్ములమ్మ, వెంకటలక్ష్మమ్మ, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి మండలంలో పునుగోడు గ్రామంలో... మండలంలోని పునుగోడు గ్రామంలో టీడీపీ నాయకులు ముచ్చుమూరి చెంచిరెడ్డి, భేరి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి


పునుగోడు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో నంబులవెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో : మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్) ఆధ్వర్యంలో మండలంలోని గాయంవారిపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై, డాక్టర్ ఉగ్ర 5 అభివృద్ధి ప్రణాళికలపై విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లను అందజేస్తారన్నారు. ప్రతి మహిళ ఆర్థిక పురోగతికి ఏడాదికి ఉచితంగా రూ.15వేలు, చదువుకునే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, నాయకులు గాయం రామిరెడ్డి, చావలి వెంకటేశ్వర్లు, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్య, బ్రహ్మంగౌడ్, తాతపూడి స్టాలిన్(బుజ్జి), డీలర్ వెంకటేశ్వర్లు, కుందురు నారాయణరెడ్డి, ఉడుముల సుబ్బారెడ్డి, ఆకుపాటి వెంకటరావు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి


నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెంచుగరటయ్య

దర్శి, మార్చి 27 : దర్శి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఎవరినీ నియమించినా పార్టీ అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలని సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య సూచించారు. ఆయన బుధవారం దర్శి నియోజకవర్గంలో పర్యటించారు. తొలుత కురిచేడు మండలంలో పర్యటించి అనంతరం దర్శి టీడీపీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం త్వరలో అభ్యర్థిని ఖరారు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నాయకులు సంగా తిరుపతిరావు, జూపల్లి కోటేశ్వరరావు, దాసరి ఏడుకొండలు, కామేపల్లి చెంచయ్య పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే సచివాలయాలు ఏర్పాటు


సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న డీఎల్‌డీవో సాయికుమార్

పామూరు, మార్చి 27 : ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించేందుకే సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వ్యవహార శైలిని మార్చుకొని సక్రమంగా విధులు నిర్వహించాలని మార్కాపురం డీఎల్‌డీవో సాయికుమార్ హెచ్చరించారు. పామూరులోని గ్రామ సచివాలయాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యునిఫాం ధరించాలని, కార్యాలయాల్లో కాలక్షేపణ చేయడానికి వస్తే కుదరబోదని హెచ్చరించారు. అనంతరం 1వ సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. సచివాలయ కార్యదర్శి అనుమతి తీసుకొని విధులలో భాగంగా వెళ్లాలని సెలవు కావాలనుకొనేవారు హెచ్ఆర్ఎంఎస్‌లో లీవ్ పెట్టాలని చెప్పారు. పామూరు సచివాలయ సిబ్బంది మంగళవారం అందుబాటులో లేరని ఒకరు జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో తనిఖీ చేసి రిపోర్టు తయారు చేశారని, ఆ రిపోర్టు ఆధారంగా 25 రోజుల సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుట్టారెడ్డి, ఈవోఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు బ్రహ్మానందరెడ్డి, రజినికాంత్, ఎన్ బ్రహ్మయ్య, మురళి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంతో తీరనున్న కష్టాలు


నాబార్డు నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులు

పామూరు, మార్చి 27 : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ అనుమునిగిరి శివరామబ్రహ్మేంద్రస్వామి స్వామి క్షేత్రం వద్ద నుంచి దూబగుంట, కాటంవారిపల్లి వరకు నాబార్డు నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నో ఏళ్ల నుంచి అనుమునిగిరి క్షేత్రానికి వచ్చే భక్తులకు సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. రూ.3.10 కోట్ల నాబార్డు నిధులతో మూడు కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మిస్తున్నామని జేఈ రమేష్ తెలిపారు. దేవస్థానం నుంచి 2.30 మీటర్లు తారురోడ్డు, గ్రామంలో 30 మీటర్ల వరకు సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అనుమునిగిరి క్షేత్రానికి శాశ్వతంగా రోడ్డు నిర్మాణం చేపడుతుండడతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



వెలిగండ్ల, మార్చి 27 : పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో జాన్‌ఇర్విన్ అధికారులను ఆదేశించారు. గురువారం వెలిగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఎవరికిస్తారనే విషయంపై అధికారులకు అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు ఫారం-12 ఇచ్చి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు వీలును బట్టి ఆ సెంటర్లో ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ రజినిబాబు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ మధుబాబు

ముండ్లమూరు, మార్చి 27 : సార్వత్రిక ఎన్నికలకు కోడ్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేయటంతో గ్రామాల్లో దానిని పకడ్బందీగా అమలు చేసే విధంగా చూడాలని తహసీల్దార్ జే మధుబాబు అన్నారు. ఆయన బుధవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వో, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. హాజరైన వారిని ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడుతూ 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేసుకొని గ్రామాల్లో రాజకీయ నాయకులకు సంబంధించి విగ్రహాలు, చిత్రపటాలకు ముసుగులు పూర్తి స్థాయిలో వేయించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల జెండాల దిమ్మెలు ఉన్నట్లయితే రంగులు తొలగించాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వారిని వెంటనే గుర్తించాలన్నారు. శంకరాపురంలో చెక్ పోస్టు ఏర్పాటు చేయటం జరిగిందని, ఆ చెక్ పోస్టులో నలుగురు వీఆర్‌వోలను నియమించటం జరిగిందన్నారు. ప్రతి రోజు వాహనాలను తనిఖీ చేయాలన్నారు. మారణాయుధాలు, నగదు పట్టుబడితే వెంటనే సీజ్ చేయాలన్నారు. రాజకీయ నాయకులకు ఏ వీఆర్‌వో కూడా కొమ్ము కాయ వద్దన్నారు. అందరూ అన్ని పార్టీలను సమాన దృష్టితో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు జీ పుల్లారెడ్డి, ఏ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు ఉన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఘోరపరాజయమే

కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్, టీడీపీ నాయకులు కేటీఆర్


ప్రచారం చేస్తున్న కేటీఆర్, టీడీపీ నేతలు

కనిగిరి, మార్చి 27 : వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాజయం తప్పదని కేటీఆర్ విద్యాసంస్థల చైర్మన్, టీడీపీ నాయకులు కుందురు తిరుపతిరెడ్డి చెప్పారు. మండలంలోని ఏరువారిపల్లిలో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలు, బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాలపై బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్‌ను నమ్మి ఒక్క చాన్స్ ఇచ్చినందుకు చెప్పుతో కొట్టుకునేంత పని చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా దివాళా తీశాడని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఉగ్రనరసింహారెడ్డి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నారపరెడ్డి(యడవల్లి)శ్రీనివాసులురెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, బాలు ఓబులరెడ్డి పాల్గొన్నారు.

చెక్ పోస్టుల వద్ద పటిష్ట చర్యలు


ఎన్నికల బూత్‌లను పరిశీలిస్తున్న అధికారులు

దర్శి, మార్చి 27 : నియోజకవర్గంలో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ ఈఆర్‌వో ఎంవీఎస్ లోకేశ్వరరావు చెప్పారు. నియోజకవర్గంలోని చెక్ పోస్టులను, పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం, నగదు సరఫరా కాకుండా చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిరంతరం అన్ని వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శి తహసీల్దార్ సుజాత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాదు పాల్గొన్నారు.

శంకరాపురంలో చెక్ పోస్టును తనిఖీ చేసిన తహసీల్దార్

ముండ్లమూరు, మార్చి 27 : మండలంలోని శంకరాపురం వద్ద ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల చెక్ పోస్టును తహసీల్దార్ జే మధుబాబు బుధవారం పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వాహనాలు తనిఖీ చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు చెక్ పోస్టులను సందర్శిస్తారన్నారు. ఆస్పత్రులకు వెళ్లే రోగులకు, బ్యాంక్‌ల వాహనాలకు మినహాయింపు ఉంటుందని చెప్పారు. మిగతా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి పంపాలన్నారు. శంకరాపురం చెక్ పోస్టులో ఓ వాహనాన్ని తనిఖీ చేసి ఏమీ దొరక్కపోతే ముందున్న చెక్ పోస్టుల్లో అదే వాహనంలో ఏమైనా దొరికితే ఆ సిబ్బందిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అంకారావు, సిబ్బంది ఉన్నారు.

పెద ఉల్లగల్లు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా సురేష్‌రెడ్డి

ముండ్లమూరు, మార్చి 27 : మండలంలోని పెదఉల్లగల్లు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా కే సురేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా పని చేసిన శ్రీనివాసరావుకు ఉద్యోగోన్నతి రావటంతో కారంచేడుకు వెళ్లినట్టు ఎంపీడీవో బీ శంకరరావు తెలిపారు. నాయుడుపాలెంలో పని చేస్తున్న సురేష్‌రెడ్డిని పెద ఉల్లగల్లుకు నియమించామన్నారు.


వేముల కార్యదర్శిగా సమీర్

ముండ్లమూరు, మార్చి 27 : మండలంలోని వేముల గ్రామానికి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పులిపాడు పంచాయతీ తండాలో పనిచేస్తున్న సమీర్‌ను నియమించినట్టు ఎంపీడీవో శంకరరావు తెలిపారు. కొన్ని రోజుల నుంచి వేముల పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవటం వల్ల ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. ఇక నుంచి ఆ సమస్యలకు ఫుల్‌స్టాప్ పడినట్లయింది.

సొసైటీ అధ్యక్షుడిని పరామర్శించిన బూచేపల్లి

ముండ్లమూరు, మార్చి 27 : ముండ్లమూరు సొసైటీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరెడ్డిని నియోజక వర్గ వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి బుధవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం వెంకటేశ్వరరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. బూచేపల్లి వెంట జడ్పీటీసీ సభ్యుడు రత్నరాజు, మండల వైసీపీ మాజీ కన్వీనర్ సూదిదేవర అంజయ్య, మాజీ సర్పంచ్‌లు చింతా శ్రీనివాసరెడ్డి, గొంది వెంకట అప్పారెడ్డి, మేడగం వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.





వేమూరు.. చైతన్యానికి మారుపేరు

- 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు
- బలహీన వర్గాల ఓట్లు కీలకం
- తొలి ఎమ్మెల్యేగా కల్లూరి
- రెండు శాఖలకు యాక్టు తయారీ
- న్యాయవాదులకు కలిసొచ్చిన సెగ్మెంట్
- 15 ఎన్నికల్లో ఐదుగురు న్యాయవాదులదే హవా

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

బ్రాహ్మణ	1700
వైశ్య	5,500
కమ్మ	23,870
రెడ్డి	8,818
కాపు	32, 254
గౌడ	12,268
యాదవ	6,339
పద్మశాలి	6,000
నాయీ బ్రాహ్మణ	2,567
రజక	5,106
పల్లెకారు	2,116
సగర	2,150
విశ్వబ్రాహ్మణ	687
ముత్తరాజు	348
వాల్మీకిబోయ	333
వడ్డెర	825
కుమ్మర	2,355
ముస్లిం	7,350
మాల	35,628
మాదిగ	31,920
ఎరుకుల	2,791
యానాది	4,139
లంబాడీ	611

బాపట్ల జిల్లాలోని వేమూరు నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి ప్రతిరూపంగా నిలుస్తోంది. ఇక్కడ గతంలో పోటీ చేసిన వారంతా గొప్ప విద్యావంతులు. దీంతో నేతల ఖిల్లాగా వేమూరు నియోజకవర్గం ఘనత వహించింది. 1955లో ఏర్పడిన ఈ సెగ్మెంట్ ద్వారా ఇప్పటికి 15 అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 2009 నుంచి ఎస్సీ రిజర్వుడుగా మార్పు చెందింది. ఇక్కడ బలహీన వర్గాల ఓట్లు కీలకం కాగా ఈ నియోజకవర్గం నుంచి ఏ పార్టీ గెలుపొందితే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్న సెంటిమెంట్ ఉంది. 1995లో తొలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొల్లూరి చంద్రమౌళి రెండు శాఖలకు యాక్టు తయారు చేశారు. ఇప్పటి వరకు ఐదుగురు న్యాయవాదులు పోటీలో విజయం సాధించడంతో పాటు వారికి ఈ సెగ్మెంట్ ఎంతగానో కలిసి రావడం జరిగింది.


యడ్లపాటి వెంకట్రావు


నాదెండ్ల భాస్కరరావు


డాక్టర్ కొడాలి వీరయ్య చౌదరి


ఆలపాటి ధర్మారావు


ఆలపాటి రాజేంద్రప్రసాద్


డాక్టర్ సతీష్ పాల్‌రాజ్


నక్కా ఆనందబాబు


డాక్టర్ మేరుగ నాగార్జున




శరణు రామస్వామి చౌదరి


కల్లూరి చంద్రమౌళి

వేమూరు, మార్చి 27: వేమూరు నియోజకవర్గంలో చరిత్ర కలిగిన అగ్రహార గ్రామాలతో పాటు చోళరాజులకు 400 సంవత్సరాలకు పూర్వపు ఆలయాలున్నాయి. రాజా వెంకటాద్రినాయుడు రాసిచ్చిన ఈనాం భూముల ఆదాయం ద్వారా ఆలయాలు విలసిల్లుతున్నాయి. ఐదు మండలాల్లో రెండు మండలాల పరిధి గ్రామాలు కృష్ణానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్నాయి. పలు లంక గ్రామాలు ఉండటమే కాక 80శాతం పైగా ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్, రబీ సాగుల ద్వారా అనేక పంటలు పండిస్తారు. కళారంగ ప్రాముఖ్యంతో పాటు రాజకీయ, విద్య, పారిశ్రామిక రంగాల్లో ఎందరో ఉన్నత స్థానాలకు ఎదిగారు. వందలాది మంది విద్యావేత్తలు అమెరికాలో పారిశ్రామికవేత్తలుగా రాణించడమే కాక ఉన్నత స్థాయిల్లో గుర్తింపు పొందారు. క్రీడా, సినీ రంగ ప్రముఖులు పుట్టిన గడ్డ కూడా. ఇక్కడి నుంచి పలు వాణిజ్య పంటలు రాష్ట్రేతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి.



సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1955	కల్లూరి చంద్రమౌళి	కాంగ్రెస్	గరికపూడి జోసెఫ్	సిపిఐ	17,428
1962	కల్లూరి చంద్రమౌళి	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	7,019
1965	శరణు రామస్వామిచౌదరి	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	488
1967	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్	4,797
1972	యడ్లపాటి వెంకట్రావు	స్వతంత్ర పార్టీ	లంకపల్లి రాఘవయ్య	కాంగ్రెస్	1297
1978	యడ్లపాటి వెంకట్రావు	కాంగ్రెస్ ఐ	కొడాలి వీరయ్యచౌదరి	జనతా	506
1983	నాదెండ్ల భాస్కరరావు	స్వతంత్ర అభ్యర్థి	యడ్లపాటి వెంకట్రావు	కాంగ్రెస్	24,645
1985	కొడాలి వీరయ్య చౌదరి	టీడీపీ	పిఎల్‌వి ప్రసాదరావు	కాంగ్రెస్	8,116
1989	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	యడ్లపాటి వెంకట్రావు	టీడీపీ	9,827
1994	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	10,194
1999	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	ఆలపాటి ధర్మరావు	కాంగ్రెస్	18,947
2004	సతీష్‌పాల్‌రాజ్	కాంగ్రెస్	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	8,776
2009	నక్కా ఆనందబాబు	టీడీపీ	మేరుగ నాగార్జున	కాంగ్రెస్	2,230
2014	నక్కా ఆనందబాబు	టీడీపీ	మేరుగ నాగార్జున	వైసీపీ	2,127
2019	మేరుగ నాగార్జున	వైసీపీ	నక్కా ఆనందబాబు	టీడీపీ	9,999

వేమూరు అసెంబ్లీ పూర్వాపరాలు

పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానంతో 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. 1955లో అమర్తలూరు నియోజకవర్గం ఏర్పాటు చేశారు. అమర్తలూరు, వేమూరు, చుండూరు, చేబ్రోలు మండలాల్లోని కొన్ని గ్రామాలుండేవి. ఈమని నియోజకవర్గం కూడా ఉండేది. ఆ తరువాత దుగ్గిరాల నియోజకవర్గం ఏర్పడి కొల్లూరు ఆ నియోజకవర్గంలో ఉండటంతో పాటు వేమూరు మండలంలోని కొన్ని గ్రామాలు కూడా దానిలో కలిసి ఉండేవి. తదుపరి మార్పుల్లో వేమూరు, కొల్లూరు మండలాలను వేమూరు సెగ్మెంట్‌లో కలిపారు. 1955 నుంచి ఇప్పటిదాకా 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఐదుసార్లు, కాంగ్రెస్ ఐ అభ్యర్థి ఒకసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి, స్వతంత్ర పార్టీ అభ్యర్థులు రెండుసార్లు, టీడీపీ అభ్యర్థులు ఐదుసార్లు, వైసీపీ అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. తొలిసారిగా 1955లో గెలుపొందిన కల్లూరి చంద్రమౌళి చట్టాలపై అవగాహన కలిగి మంత్రిగా కొనసాగుతూ నాటి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు స్వతంత్ర ప్రతిపత్తి కోసం శ్రమించారు. ఇంగ్లడ్‌లో అభివృద్ధిని గుర్తించి రాష్ట్రంలో మార్పు కోసం కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 1947లో మద్రాసు ప్రావిన్స్‌లో ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఒడిస్సాలోని కొంత భాగం కలిసి ఉండేది. ఆనాడు పెద్దలు చంద్రమౌళి ప్రతిభను గుర్తించి లోకల్ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించారు. 1933లో ఆయన నా దేశం రాజ్యాంగం, పంచాయితీరాజ్ చట్టాన్ని రాశారన్న విషయం గ్రహించి స్థానిక స్వపరిపాలన మంత్రిగా, సహకార రంగ మంత్రిగా బాధ్యతలు ఇచ్చారు. 1952దాకా మంత్రి పదవుల్లో కొనసాగారు. 1960లో దేవాదాయ, రెవెన్యూశాఖలు అప్పగించారు.

1962లో వేమూరు నియోజకవర్గ ప్రారంభ సభ్యుడిగా, స్వతంత్ర అభ్యర్థి వెంకట్రావుపై పోటీ చేసి గెలుపొందారు. తిరిగి రెండు మంత్రి పదవులు కొనసాగించి రెవెన్యూ, దేవాదాయశాఖ చట్టంలో పెను మార్పులు తెచ్చారు. 1965నుంచి జరిగిన 12 ఎన్నికల్లో వేమూరు స్థానం నుంచి మంత్రులైన వారందరూ న్యాయవాదులు కావడం విశేషం. తెనాలి ప్రాంతంలో ప్రముఖ న్యాయవాదిగా గుర్తింపు పొందిన యడ్లపాటి వెంకట్రావు 1965 మధ్యంతర ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగి ఓటమి పాలయ్యారు. 1967 ఎన్నికల్లో గెలుపొందారు. 1972 ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. 1978లో కూడా గెలుపొంది మంత్రి పదవిని సాధించారు. 1983 ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా నిలబడ్డ నాదెండ్ల భాస్కరరావుతో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీపడ్డ యడ్లపాటి ఓటమి పాలయ్యారు. గెలుపొందిన భాస్కరరావు ముఖ్యమంత్రి అయి వేమూరు సెగ్మెంట్‌కు గుర్తింపు తెచ్చారు. 1985లో టీడీపీ అభ్యర్థి కొడాలి వీరయ్య గెలుపొందారు. 1989లో సీనియర్ న్యాయవాది ఆలపాటి ధర్మరావు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. యడ్లపాటిని ఓడించి మంత్రి అయ్యారు. 1994లో ధర్మరావుపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ అభ్యర్థిగా గొప్ప మెజార్టీ సాధించి మంత్రి అయ్యారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి పాల్‌రాజ్‌పై బరిలో దిగిన రాజేంద్రప్రసాద్ ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో న్యాయవాది నక్కా ఆనందబాబు టీడీపీ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థి అయిన మేరుగ నాగార్జునపై గెలుపొందారు. 2014ఎన్నికల్లో ఆనందబాబు వైసీపీ అభ్యర్థిగా నిలబడ్డ నాగార్జునపై మరో సారి విజయం సాధించారు. మంత్రి వర్గ విస్తరణలో క్యాబినెట్ మంత్రిగా ఆనందబాబు పనిచేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నాగార్జునపై పోటీగా నిలిచిన ఆనందబాబు ఓటమి పాలయ్యారు. నాగార్జున క్యాబినెట్ హోదాలో మంత్రి పదవి దక్కించుకున్నారు. ఈ సెగ్మెంట్ న్యాయవాదులకు ఎంతగా నో కలిసొచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు.

బరిలో అభ్యర్థులు

తాజా ఎన్నికల బరిలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా నక్కా ఆనందబాబు పేరును ఖరారు చేశారు. వైసీపీ నుంచి సంతనూతలపాడు వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న వరికూటి అశోక్‌బాబుకు వేమూరు స్థానాన్ని ప్రకటించారు. దీంతో వీరిద్దరూ నియోజకవర్గంలో ప్రచారాన్ని కొనసాగించారు. రాష్ట్రీయ దళిత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బుస్సా నాగరాజు పేరును ప్రకటించారు.

మొత్తం ఓటర్లు 1,95,756
పురుషుల ఓట్లు 94,875
మహిళల ఓట్లు 1,00,872
ఇతరుల ఓట్లు-9


రుద్రవరం సమీపంలోముళ్ల చెట్లతో మూసుకుపోయిన కరకట్ట

మరమ్మతులపై.. మౌనం

- కోతలతో ప్రమాదభరితంగా కరకట్టలు
- ఇసుక టిప్పర్ల రాకపోకలతో భారీ గోతులు
- వరదలప్పుడు హడావుడి.. ఆ తర్వాత నిర్లక్ష్యం
- కరకట్ట భద్రతపై దృష్టి సారించని ఆర్సీ అధికారులు

రేపల్లె, మార్చి 27: కృష్ణానది కరకట్ట పటిష్టతపై వేలాది ఎకరాల్లో పంటలు, వందల గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. కరకట్ట ఎక్కడికక్కడ గోతులతో, కోతలతో ప్రమాదభరితంగా మారింది. అయినా అధికారులు కట్ట పటిష్టత గురించికానీ, మరమ్మత్తుల గురించి కానీ ఆలోచించడంలేదు. కష్ణానదికి వరదల సమయంలో మాత్రం హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. దీంతో కరకట్ట సమీప 30 గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళనలో ఉన్నారు. తీరప్రాంతంలోని భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో సుమారు 40కి.మీ మేర ఉన్న కరకట్టపై అధికారుల పర్యవేక్షణ లేదు. దీంతో ఇసుక, మట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకలతో కరకట్ట మోకాలు లోతు గుంతలతో నిండిపోయింది. కరకట్ట వెంబడి పెట్రోలింగ్ నిర్వహించాల్సిన ఆర్సీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. వరదల సమయాల్లో అధికారులు హడావుడిగా వచ్చి నామమాత్రంగా కోతల వద్ద ఇసుక బస్తాలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత కట్ట భద్రత గురించి కనీస చర్యలు కూడా తీసుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. గతంలో ఓలేరు పల్లెపాలెం సమీపంలో కట్టకు గండి పడి వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో పాటు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. గత వర్షాకాలంలో కొన్ని ప్రాంతాల్లో గాడులు పడి కోతలకు గురై కట్ట ప్రమాదభరితంగా మారింది. భట్టిప్రోలు మండలం వెల్లటూరు సమీపంలో కట్ట చిధ్రమై మోకాలు లోతు గుంతలు పడి ప్రమాదభరితంగా మారింది. పెదపులివర్రు, ఓలేరు మధ్యలో తారురోడ్డు భారీగా బీటులు వారింది. రేపల్లె మండలం రావి అనంతవరం, పెనుమూడి, కరకట్ట గుంతలమయంగా మారింది. రుద్రవరం, ఘైనేనివారిపాలెం, మోర్తోట ప్రాంతాల్లో గత వర్షాలకు కరకట్ట అంతా ఒక వైపు కోతలకు గురై మట్టికొట్టుకుపోయింది. కనగాలవారిపాలెం సమీపంలో ఘైనేనివారిపాలెం, పిరాట్లంక సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా కరకట్టకు పైప్‌లైన్లు వేసి ఆయిల్ ఇంజన్లను ఏర్పాటు చేశారు. గంగడిపాలెం, రాజుకాల్వ, లక్ష్మీపురం, లంకేవానిదిబ్బ సమీపంలో కరకట్ట కోతలకు గురైంది. లక్ష్మీపురం నుంచి లంకేవానిదిబ్బ వరకు నదిని ఆనుకుని రొయ్యల సాగుతో కరకట్ట బాటగా మారింది. ప్రమాదభరితంగా మారిన కట్టను వేసవిలో పటిష్ట పరుస్తామని పాలకులు, అధికారులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో అమలు చేయడంలేదు. ఈ వేసవిలో అయినా కట్టకు మరమ్మత్తులు చేసి పటిష్ట పరచాలని ప్రజలు కోరుతున్నారు.




పెనుమూడి వారధి సమీపంలో కోతకు గురైన కరకట్ట


కనగాలవారిపాలెం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా పైపులైన్లు అమర్చిన ఆయిల్ మోటార్లు


చెన్నుపల్లివారిపాలెం సమీపంలో కోసుకుపోయిన కరకట్ట

బాపట్ల ఎస్పీకి డిస్క్‌గోల్డ్ మెడల్

త్వరలో అందజేయనున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



బాపట్ల, మార్చి 27: శాంతిభద్రతలతోపాటు దిశ, కన్విక్షన్ బెస్ట్ పోలీసింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అందజేసే డిస్క్‌గోల్డ్ మెడల్‌కు ఈ ఏడాది ఎస్పీ వకుల్ జిందాల్ ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన మరో 8 మందికి బ్రొంజ్ డిస్క్ అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి అవార్డుతో పాటు పతకాల్ని త్వరలో పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అందజేయనున్నారు. ఈ మేరకు ఎంపికైన వారికి డీజీపీ కార్యాలయం నుంచి సమాచారం అందింది.


గడియార స్తంభంసెంటర్ వద్ద రోడ్డు కింద పైపులైన్ పగిలి తాగు నీరు పైకి ప్రవహిస్తున్న దృశ్యం.

తాగునీరు.. వృథా

- పగులుతున్న పైపులైన్‌లు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న పట్టణ ప్రజలు

బాపట్ల, మార్చి 27: తాగునీటి వృధాను బాపట్ల మున్సిపల్ అధికారులు అరికట్టలేకపోతున్నారు. పైపులైన్‌లు పగిలి నీరంతా రోడ్లపైన ప్రవహిస్తున్నప్పటికీ వారికి కనిపించటంలేదు. అసలే వేసవి ఆపైన చెరువులో నీటి నిల్వ తక్కువగా ఉంది. ఇప్పటికే రోజుమార్చి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఉన్న నీరు ప్రణాళిక ప్రకారం సరఫరా చేస్తేనే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడగలరు. రోడ్డు విస్తరణ పేరిట సంబంధిత కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేపట్టిన పనుల వల్ల పైపులైన్‌లు ధ్వంసం అయ్యాయి. వాటిని మరమ్మత్తులు చేసినా ప్రయోజనం లేదు. కేవలం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈవిధంగా జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రధాన రహదార్ల కింద పైపులైన్‌ల లీక్‌లు

పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లో జీబీసీ రోడ్డు కింద పగిలిన పైపులైన్ కు ఇప్పటికే పదిసార్లకు పైగా మరమ్మత్తులు చేశారు. అయినప్పటికీ లీక్‌లు ఏర్పడుతూనే ఉన్నాయి. ఇదేవిధంగా ఉప్పరపాలెం వెళ్ళే రోడ్డులో కూడా పైపులైన్ పగిలి సీసీరోడ్డును చీల్చుకొని నీరు బయటకు వస్తోంది. ఇక జీబీసీ రోడ్డులో అయితే డ్రైనేజిల పక్కన అనేక లీక్‌లు ఏర్పడి నీరు వృధా అవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపకపోతే నీరంతా వృధా అయి వేసవిలో తాగునీటి ఎద్దడి తప్పదు. గడియార స్తంభం సెంటర్‌లో దెబ్బతిన్న పైపులైన్ మరమ్మత్తులను మంగళవారం చేపట్టారు. మెయిన్ పైపులైన్ పక్కనే సరఫరా చేసే పైపులైన్‌లు దెబ్బతినటంతో వాటిని మరమ్మత్తులు చేసే పనిలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. కాగా ఈ విషయమై మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా పైపులైన్‌లు పలుచోట్ల లీక్‌లు ఏర్పడినట్లు గుర్తించామన్నారు. యుద్ధ ప్రాతిపదికన చేపడతామన్నారు.


రోడ్డును తవ్వి పైపులైన్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వైసీపీ బ్లాక్‌మెయిల్ రాజకీయం

కొందరికి పదవులు, మరికొందరికి బెదిరింపులు


అసమ్మతి బుజ్జగింపులకు జగన్ మార్క్ రాజకీయం

స్వయంగా సీఎం రంగంలోకి..

చక్రం తిప్పుతున్న ఎంపీ అభ్యర్థి..

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీ అధిష్ఠానం సరికొత్త రాజకీయానికి తెరలేపింది. మాట వింటే ఒకే లేకుంటే బెదిరింపులకు తెగబడుతోంది. చిన్నాచితక పదవులతో సరిపెట్టుకోవడం లేదా భవిష్యత్‌లో న్యాయం చేస్తామని హామీని నమ్మి పనిచేస్తే సరి లేకుంటే అసలుకే ఎసరు పెడతామని హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో అవకాశం లభించని పలువురు సీనియర్లు పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. వారిలో కొందరికి పార్టీ, నామినేటెడ్ పదవులతో బుజ్జగించారు. అందుకు అవకాశం లేనివారిని, చిన్నాచితక పదవులకు లొంగని వారిని బెదిరించటం ప్రారంభించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సిటింగ్ ఎమ్మెల్యేలలో ముగ్గురికి, మాజీలలో నలుగురికి పార్టీ టికెట్ల విషయంలో అధిష్ఠానం మొండిచేయి చూపింది. వారిలో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డికి హడావుడిగా ఏపీఐఐసీ ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. అదే నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు ఆలీబేగ్‌కు ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని ఎన్నికల షెడ్యూల్‌కు రెండు రోజుల ముందు ఇచ్చేశారు. టికెట్ల లభించక అసమ్మతితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఆ పార్టీ నాయకులకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. తాజాగా ఆయన వేరే పార్టీలోకి మారే అవకాశం ఉందని తెలిసి ఆయన వ్యాపారాలపై దృష్టిసారించారు. కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డి పార్టీ అభ్యర్థికి ప్రచారం చేయకపోయినా వెళ్లిన పార్టీ నాయకులతో మాట్లాడుతూ కాలం గడుపుతున్నారు. ఆయనకు స్థానికంగా వ్యాపారాలు ఏమీ లేవు. అద్దంకి మాజీ వైసీపీ ఇన్‌చార్జి, శాప్‌నెట్ ఛైర్మన్ అయిన బాచిన కృష్ణచైతన్య టికెట్ లభించక అలకపాన్పు ఎక్కగానే ఆయన గ్రానైట్ క్వారీపై దాడులు నిర్వహించి నోటీసులు జారీచేశారు. క్వారీ మూసేసిన చైతన్య టీడీపీలో చేరిపోయారు.



కొత్త ఒరవడికి శ్రీకారం

బెదిరింపు ఫలితం బెడిసికొట్టడంతో మిగిలిన నాయకులను నేరుగా జగనే పిలిపించి మాట్లాడేందుకు శ్రీకారం పలికారు. తొలుత కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావుపై బెదిరింపు అస్త్రం ప్రయోగించారు. టికెట్ లభించని ఆయన అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసి స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి వచ్చే ఊహాగానాలను బయటకు వదిలారు. తర్వాత తన మిత్రుడైన సినీనటుడు బాలకృష్ణ ద్వారా టీడీపీ వైపు దృష్టిసారించారని వార్తలొచ్చాయి. వెంటనే వైసీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి బాబూరావును సీఎం వద్దకు తీసుకెళ్లారు. బాబూరావుకు కనిగిరి నియోజకవర్గంలో బీ ఫార్మసీ కళాశాల ఉంది. ఆయన వియ్యంకుడికి విశాఖపట్నం వద్ద ఫార్మా కంపెనీలున్నాయి. ఈ నేపథ్యంలో అనేక అంశాలను గుర్తుచేస్తూ అధిష్ఠానం నుంచి సంకేతాలు ఇచ్చి సీఎంను కలిపి ఆయనను సైలెంట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

> అసమ్మతి నాయకులను బుజ్జగించేందుకు బ్లాక్‌మెయిల్ వ్యవహారాలకు అధికార వైసీపీ తెరతీసింది. అవసరమైతే నేరుగా ఆ పార్టీ అధినేత, సీఎం జగన్ నాయకులను పిలిపించుకుని తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. కొందరి వ్యాపారాలు, అందులో లొసుగులను ప్రస్తావిస్తూ ముందుగా సంకేతాలు పంపటం ఆపై వారితో నేరుగానే అధినాయకులు మాట్లాడుతూ హెచ్చరికలు జారీ చేస్తూ సరికొత్త రాజకీయానికి తెరలేపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ వ్యవహారం శ్రుతిమించింది.

శిద్దా సైలెంట్

తాజాగా మాజీమంత్రి శిద్దా రాఘవరావును కూడా జగన్ వద్ద హాజరుపరిచారు. గత ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన శిద్దా గ్రానైట్ సంస్థలపై జగన్ ప్రభుత్వం ఆరంభంలోనే దాడి చేసింది. సుమారు రూ.300 కోట్ల జరిమానాలను విధించింది. క్వారీలలో పనులు నిలిపివేసింది. టీడీపీ ఎమ్మెల్యే అయిన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు క్వారీలపైనా అలాంటి చర్యలే తీసుకున్నారు. వెంటనే శిద్దా వైసీపీలో చేరటంతో జరిమానా నోటీసులు పక్కనపెట్టి క్వారీలు నడుపుకునేందుకు అవకాశం ఇచ్చారు. పార్టీ మారని రవికుమార్, రామారావుల క్వారీలు, ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. తాజాగా టీడీపీలో చేరాలన్న ఆలోచనతో శిద్దా కొంతకాలంగా వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. వైసీపీలో దర్శి టికెట్ ఆశించి విఫలమైన ఆయన టీడీపీలో వచ్చే అవకాశం ఉండటంతో మంతనాలు ప్రారంభించారు. బుధవారం ఆయన టీడీపీ అధినాయకులను కలిసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో హడావుడిగా మంగళవారం ఆయనను సీఎంఓ అధికారులు పిలిపించి జగన్ ముందు హాజరుపరిచారు. గ్రానైట్ క్వారీలకు, కంపెనీలకు గతంలో ఇచ్చి పెండింగ్‌లో ఉన్న నోటీసుల వ్యవహారం చర్చకు తెచ్చినట్లు తెలిసింది. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుంది అని చెప్పి ఆర్థిక వనరులకు ఎదురయ్యే సమస్యలను కూడా పరోక్షంగా ముందుగానే ఆయన దృష్టికి తీసుకెళ్లి తర్వాత సీఎం ముందు ప్రవేశపెట్టినట్లు సమాచారం. సీఎం కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవి అవకాశం ఇస్తానంటూ పరోక్షంగా కొన్ని సమస్యలను ప్రస్తావించి పంపినట్లు తెలిసింది. దీంతో శిద్దా, ఆయన కుటుంబసభ్యులు ఈ ఎన్నికల్లో పోటీ ఆలోచన విరమించుకుని సైలెంట్ అయ్యారు.

ఆమంచిపైనా కన్ను

ఇక చీరాలలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయన పర్చూరు వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు జరిగిన అవినీతి వ్యవహారాలను, చీరాలలో ఆయన సంస్థలలో ఉన్న లొసుగులను అప్పట్లోనే సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సొంత పార్టీ వారే సీఎంకు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు. అయినా పట్టించుకోని అధిష్ఠానం ఇప్పుడు చీరాలలో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి రాబోతున్న తరుణంలో కొరడా ఝులిపిస్తోంది. ఆమంచికి చెందిన క్రిస్టల్ సీ ఫుడ్స్, ఆయన సమీప బంధువులకు చెందిన హేచరీలకు సంబంధించి సుమారు రూ.5.82కోట్ల విద్యుత్ బకాయి ఉంది. గతంలో ఆయన అధికారాన్ని అడ్డుపెట్టి దశలవారీ బకాయి చెల్లింపునకు అనుమతి తెచ్చుకున్నారు. అప్పుడు చేయూతనిచ్చిన ప్రభుత్వం ఇప్పుడు విద్యుత్ శాఖ ద్వారా బకాయిల వసూళ్లకు వత్తిడి పెంచింది. మరోవైపు ఆయన ఆక్వా భూములు, ఇతర అంశాలకు సంబంధించి కూడా లొసుగుల కోసం అధికారులు పరిశీలన ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే మాజీ మంత్రి శిద్ధా, మాజీ ఎమ్మెల్యే బాబూరావులు వెనక్కు తగ్గినా బహిరంగంగా వైసీపీ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొనటం లేదు. ఆమంచి మాత్రం ఇండిపెండెంట్‌గా పోటీ ఆలోచనతోనే అనుచరులతో మంతనాలు జరుపుతున్నారు. అసమ్మతి నేతలపై బెదిరింపు వ్యవహారాలకు పాల్పడుతున్న వైసీపీ తీరుతో నాయకుల అనుచరులు మాత్రం తీవ్రంగా ఆ పార్టీ పోకడను ద్వేషిస్తున్నారు.

పోలింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ ఫణీంద్రబాబు



సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ ఫణీంద్రబాబు

పర్చూరు, మార్చి 27: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారులు(పీవో) లు అప్రమత్తంగా ఉండాలని చినగంజాం తహసీల్దార్ జీవీఎన్ ఫణీంద్రబాబు అన్నారు. పర్చూరులోని క్రీడా వికాస కేంద్రంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆధికారి , రెవెన్యూ డివిజన్ అధికారి జి.రవీందర్ అధ్యక్షతన ఆయా మండలాల పరిధిలోని పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చే మాస్టర్స్ ట్రైనర్స్, ఈవీఎం, వీవీప్యాట్ సీయూ, బీయూ పని విధానం, పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏ ఫాం ఎలా పూరించాలి, మాక్ పోలింగ్ నిర్వహణ, ఈవీఎం పనివిధానం, అవాంతరాలు లేకుండా ఎలా నిర్వహించాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. పీవో, ఏపీవోలకు ఈ మాస్టర్ ట్రైనర్స్ తగు శిక్షణ ఇస్తారని అందుకు అనుగుణంగా తయారు కావాలని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య, యద్దనపూడి తహసీల్దార్ వై.నాగరాజు, ఎన్నికల డీటీ పి.సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారావు మృతదేహానికి వైద్య సిబ్బంది నివాళి



సుబ్బారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యాధికారి, వైద్య సిబ్బంది

చినగంజాం, మార్చి 27 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న చున్నకోల సుబ్బారావు(77) మంగళవారం మృతిచెందాడు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్. విజయభాస్కరరావు, పీ.సాయిశ్రీచరణ్, వై.భవానీలు సుబ్బారావు మృతికి సంతాపం తెలియజేశారు. పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారి బి.నాగేంద్ర, సీ.హెచ్‌వో ఝాన్సీరాణి, పీహెచ్ఎన్ ఎస్.బేబి, సూపర్‌వైజర్లు చిరంజీవి, ఉల్దారాణి, ల్యాబ్ టెక్నీషియన్ కే.శ్యాంసుందరబాబు, ఎంఎల్‌హెచ్‌పీలు నర్రా మురళి, మహేష్, ఎంఎన్‌వో సుబ్బారావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు బుధవారం సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సమకూర్చిన రూ.25,000ల ఆర్థిక సాయాన్ని వైద్యాధికారి నాగేంద్ర సుబ్బారావు కుటుంబసభ్యులకు అందజేశారు. సుబ్బారావు సీహెచ్‌సీలో 50 సంవత్సరాలుగా వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు.

చేనేత కుటుంబం మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

చీరాలటౌన్, మార్చి 27 : కడపలో చేనేత కుటుంబం మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కడపలో రెవెన్యూ అధికారులు మరికొందరి కారణంగా చేనేత కుటుంబం అనుమానాస్పద పరిస్థితిలో కుటుంబంలో ముగ్గురు చనిపోయారు. ఈక్రమంలో బుధవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో చేతివృత్తుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మృతులు రెండేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినట్లు వివరించారు. వారికి న్యాయం చేయకపోగా ఉద్దేశపూర్వకంగా జరిగిన హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే ఘటనపై న్యాయపరమైన విచారణ జరపాలని, నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, కొండయ్య, నాగేశ్వరరావు, గుమ్మడి ఏసురత్నం, అవ్వారు అనిల్, ఎన్.బాబురావు, ఏ.బాబురావు, జయరాజు, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

15 మంది విద్యార్థులకు ఉపకార వేతనం



ఎంపికైన విద్యార్థుల వివరాలను విడుదల చేస్తున్న సభ్యులు

పంగులూరు, మార్చి 27 : విద్యోన్నతి ఫౌండేషన్ ద్వారా అందించే మెరిట్ స్కాలర్‌షిప్‌లకు పలు పాఠశాలలకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఫౌండేషన్ డైరక్టర్ ధూళిపాళ్ళ వీరనారాయణ తెలిపారు. జాగర్లమూడివారిపాలెం మాజీ సర్పంచ్ ధూళిపాళ్ళ వెంకటేశ్వర్లు, గంగవరం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బోడెంపూడి రామ్మూర్తిల జ్ఞాపకార్థం విశ్రాంత బ్యాంక్ మేనేజర్ వీరనారాయణ విద్యోన్నతి ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. 2024- 26 విద్యా సంవత్సరానికి ఫిబ్రవరి 11న అద్దంకి, పంగులూరు, ఇంకొల్లు మండల కేంద్రాలలో పదవ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన 15 మంది విద్యార్థుల జాబితాను బుధవారం ప్రకటించారు. ఈ పరీక్షలో అద్దంకి, బూదవాడ, చందలూరు, పావులూరు, దుద్దుకూరు ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరు చొప్పున, తిమ్మాయపాలెం, చక్రాయపాలెం, దేనువకొండ, పంగులూరు, గంగవరం ఉన్నత పాఠశాలల నుంచి ఒక్కొక్కరు ఈ ఉపకార వేతనం పొందేందుకు అర్హత సాధించినట్లు వీరనారాయణ తెలిపారు. ఎంపికయిన విద్యార్థులకు ఇంటర్ విద్యకు ఏడాదికి రూ. 10వేల వంతున నగదు ప్రోత్సాహం అందజేయనున్నట్లు వీరనారాయణ తెలిపారు.

ఘనంగా కార్పెంటర్స్ డే వేడుకలు

అద్దంకిటౌన్, మార్చి 27: అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్పెంటర్స్ డే వేడుకలు సంఘ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసచారి హాజరై కార్పెంటర్లకు ప్రభుత్వం సబ్సిడీపై కలప మంజూరు చేయాలని, చేతివృత్తుల వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కార్పెంటర్ వృత్తిలో దారు శిల్పిగా పేరుపొంది, చెక్క మీద బొమ్మలు చెక్కిన ప్రముఖులైన 12 మంది కార్పెంటర్లను సంఘ సభ్యులు, వేద పురోహితులు సత్తెనపల్లి శ్రీశైలం తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొన్నపల్లి బ్రహ్మానందం, వెంకట సుబ్బారావు, కోటిలింగాచారి, హరిబాబు, రమేష్, వెంకటేశ్వరరావు, శంకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కార్పెంటర్‌లను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

కోడ్ లేదా సారూ..!

వైసీపీ రంగుల ట్యాంకర్‌తో నీటి సరఫరా

మల్లాపాలెం వైపు చూడని ఎన్నికల అధికారులు



మల్లాపాలెంలో వైసీపీ రంగులతో ట్యాంకరుతో తోలుతున్న నీరు

పుల్లలచెరువు, మార్చి 24: పుల్లలచెరువు మండలంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గ్రామాల్లో ఎన్నికల అధికారుల పర్యవేక్షణ కరువవడంతో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ రంగులతో ట్యాంకర్లు, జెండాలు ఇప్పటికి దర్శనం ఇస్తున్నాయి. ఎన్నికల కోడ్ 11 రోజులు గడిచినా అధికారుల నిర్లక్ష్యంతో నేటికి వైసీపీ రంగులు కనిపిస్తున్నాయి. మండలంలోని మల్లాపాలెం గ్రామంలో యదేచ్ఛగా కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. గ్రామంలో అధికార పార్టీ నియోజవర్గ నాయకుడి ఆధ్వర్యంలో ట్యాంకరుకు వైసీపీ రంగులు పూసి ఇంటింటికి నీటి సరాఫరా చేస్తున్నారు. అయినప్పటికీ, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలుచేయని అధికారులపై జిల్లా ఎన్నికల అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

శంకరాపురంలో చెక్ పోస్టును తనిఖీ చేసిన తహసీల్దార్



తనిఖీ చేస్తున్న తహసీల్దార్

ముండ్లమూరు, మార్చి 27 : మండలంలోని శంకరాపురం వద్ద ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల చెక్ పోస్టును తహసీల్దార్ జే మధుబాబు బుధవారం పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ వాహనాలు తనిఖీ చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు చెక్ పోస్టులను సందర్శిస్తారన్నారు. ఆస్పత్రులకు వెళ్లే రోగులకు, బ్యాంక్‌ల వాహనాలకు మినహాయింపు ఉంటుందని చెప్పారు. మిగతా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి పంపాలన్నారు. శంకరాపురం చెక్ పోస్టులో ఓ వాహనాన్ని తనిఖీ చేసి ఏమీ దొరక్కపోతే ముందున్న చెక్ పోస్టుల్లో అదే వాహనంలో ఏమైనా దొరికితే ఆ సిబ్బందిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

నిరంతరం ఎన్నికల విధుల్లో వలంటీర్లు

అధికారపార్టీ నేతలతో కలిసి ఇష్టారీతిన ప్రచారం

తొలగిస్తామని హెచ్చరిస్తున్నా వెనక్కితగ్గని పరిస్థితి

ఓటర్లను ప్రభావితం చేస్తున్నా పట్టించుకోని అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 27: జిల్లాలో వలంటీర్లు అధికార పార్టీ అనుకూలంగా వ్యవహరిస్తూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నా అధికారుల చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అధికారం మాదే అన్న చందంగా వలంటీర్లు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఇతర ముఖ్యనేతలతో కలిసి బహిరంగంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్న పరిస్థితి లేకుండా పోయింది. రాష్ట్రస్థాయి నుంచే వలంటీర్లకు అనుకూలంగా వ్యవహారాలు నడుస్తుండటంతో క్షేత్రస్థాయిలో వారు చెప్పిందే వేదం అన్నట్లుగా ఉంది. ప్రతిరోజు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లు ఎక్కడికక్కడ అధికారపార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న ఫొటోలు, ఫిర్యాదులు వస్తున్నా ఏదో మొక్కుబడిగా ఒకరిద్దరిని తొలగిస్తున్నారే తప్ప మిగిలిన వారిని పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి పది రోజులకుపైగా గడుస్తుండగా ఈ కాలంలో పట్టుమని పదిమందిని మాత్రమే విధుల నుంచి తొలగించారు. దీంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వారి హవానే నడుస్తోంది. ఆయా ప్రాంతాలకు అధికారపార్టీ నేతలు వచ్చిన సమయంలో ఆయా గృహాల వద్ద వారే ముందుండి మాట్లాడిస్తున్నారు. అందరూ బయటకు వచ్చి వైసీపీ నాయకులతో మాట్లాడాలంటూ బెదిరిస్తున్నారు కూడా. మండల స్థాయిలో ఎంపీడీఓలు అడపాదడపా కొంతమందిని తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటనలు ఇస్తున్నా అవేమీ అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఎన్నికల ప్రచారంలో అధికారపార్టీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొనే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నేతలు కోరుతున్నారు.

ముగిసిన పది పరీక్షలు

విద్యార్థులు కేరింతలు.. హాస్టళ్ల నుంచి ఇళ్లకు పయనం

ఒంగోలు(విద్య), మార్చి 27 : జిల్లాలో ఈ నెల 18 నుంచి జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో కీలక సబ్జెక్టుల పరీక్షలు బుధవారంతో ముగిశాయి. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సారి పరీక్షల్లో ఒక్కరంటే ఒక్క విద్యార్థి కూడా డిబార్ కాలేదు. 4 ఎస్ పరీక్షకు ఈనెల 28న 94 కేంద్రాల్లో 3,407 మంది, ఓఎస్ఎస్‌సీ పరీక్షకు రెండు కేంద్రాల్లో 15మంది, ఈనెల 30న ఒకేషనల్ పరీక్షకు 22 కేంద్రాల్లో 2,226మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. మిగిలిన విద్యార్థులందరి పరీక్షలు ముగిశాయి. జిల్లాలో బుధవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు 99శాతం మంది హాజరయ్యారు. పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 28,160మందికిగాను 27,898 మంది హాజరు కాగా 262మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు కేవలం 22.83 శాతం మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 600మందికి గాను 137 మంది మాత్రమే హాజరు కాగా 463 మంది డుమ్మాకొట్టారు. పరీక్షల పరిశీలకులు ఎంఆర్.ప్రసన్నకుమార్ ఏడు, జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర మూడు కేంద్రాలను సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మొత్తం 60 కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ముఖ్యమైన పరీక్షలన్నీ ముగియడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పరీక్ష ముగిసి కేంద్రాల నుంచి బయటకు రాగానే విద్యార్థులు కేరింతలు కొట్టారు. బస్సుల్లో తమ చేతుల్లోని పేపర్లను ముక్కలుగా చించి రోడ్లపై చల్లారు. ఒంగోలు హస్టళ్లలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు లగేజీ సర్దుకొని తల్లిదండ్రులతో తమ సొంత గ్రామాలకు పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండు రద్దీగా మారింది.

తనిఖీలో రూ. 2.63లక్షల నగదు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

చినగంజాం, మార్చి 27 : చినగంజాం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్య గల 216వ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన బోర్డర్ చెక్‌పోస్టులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బుధవారం రూ.2,63,600ల నగదు పట్టుబడింది. ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం ఒంగోలు వైపు నుంచి చీరాల వైపు వెళ్తున్న ఏపీ 27 బీజీ 9339 నెంబరు గల హూండాయి కారుని ఆపి తనిఖీ చేయగా, కారు వెనుక డిక్కీలో నల్లటి కవర్‌లో నగదు ఉన్నట్లు గుర్తించారు. పొన్నలూరు మండలం విప్పగుంట గ్రామానికి చెందిన కారు డ్రైవర్ కొంకం నవీన్‌తో పాటు అదే గ్రామానికి చెందిన కొంకం ప్రసాదు, బండారు మాల్యాద్రి, ఘట్టమనేని అభిరామ్‌లు కారులో ఉన్నారు. నగదు గురించి పోలీసులు కొంకం ప్రసాద్‌ని ప్రశ్నించగా కారులో ఉన్న వారందరూ తన బంధువులని, ఆ నగదు తనదేనని తెలిపాడు. తన అన్నయ్య కొంకం మురళికృష్ణ ఈ నెల 16వ తేదిన మరణించాడని,, 28వ తేదీన వారి స్వగ్రామంలో పెద్దకర్మ నిర్వహిస్తుందున కార్యక్రమానికి కావలసిన వస్తుసామగి నిమిత్తం విప్పగుంట గ్రామం నుంచి చీరాలకు రూ.2,63,600లనగదు తీసుకొని వెళ్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ప్రకారం ఒక వ్యక్తి రూ.50,000ల కంటే ఎక్కువ నగదును కలిగి ఉండటం, సరైన పత్రాలు కావాలని, మీ వద్ద ఉన్న నగదుకు సంబంధించిన రసీదులు ఏమైనా ఉన్నాయా అని ప్రసాదుని పోలీసులు ప్రశ్నించారు. తన వద్ద ఉన్న నగదుకి ఎలాంటి రసీదులు లేవని ప్రసాదు తెలపడంతో ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50,000ల కంటే ఎక్కువ నగదు కలిగి ఉన్నందున, ఆనగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సీజ్ చేసిన నగదుని చీరాల ట్రెజరీ కార్యాలయంలో జమ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీలో ఎస్ఐ ఎ.హరిబాబు, ఇంకొల్లు ఏఎస్ఐ ఎం.ముస్తఫా, కానిస్టేబుళ్లు డి.శ్రీనివాసరావు, పి.హేమసుందర్, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్, ప్రతిష్ఠించిన అభయాంజనేయస్వామి విగ్రహం

బల్లికురవ, మార్చి 27 : మండలంలోని గొర్రెపాడులో బుధవారం అభయాంజనేయస్వామి, బాలవీరాంజనేయస్వామి, వినాయకస్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్థులు సమష్టి కృషితో సుమారు రూ. 35 లక్షలు విరాళాల సేకరణతో అభయాంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు పనులు చేపట్టారు. కడప జిల్లా బద్వేలుకు చెందిన ప్రతిష్ఠాచార్యులు ఓరుగంటి సీతారామ శాస్త్రి పర్యవేక్షణలో అర్చక స్వామి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పలువురు వేద పండితులచే అభయాంజనేస్వామి విగ్రహ పతిష్ఠ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఈ విగ్రహం క్రింద భాగంలో వినాయక స్వామి, బాలవీరాంజనేయస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. భక్తులు జై శ్రీరాం నినాదాలు హోరెత్తాయి. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ పూజలలో అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్, వినుకొండ మాజీ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

బెల్టుషాపునకు అక్రమంగా మద్యం తరలింపు

కంభం, మార్చి 27: ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి బెల్టుషాపునకు అక్రమంగా రూ.45వేల విలువైన మద్యం తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లను, ప్రభుత్వ దుకాణంలో పనిచేసే సిబ్బందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ డీఎస్పీ దుర్గాప్రసాద్ బుధవారం చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. అర్ధవీడు మండలం కాకర్ల గ్రామం ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేసే కొప్పుల వెంకటరమేష్, వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న దార్ల అనీల్, యాచవరంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న యామా చిన్నవెంకటేశ్వర్లు కలిసి బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో సుమారు రూ.48వేల విలువైన 288 క్వార్టర్ బాటిళ్లను కారులో యాచవరం బెల్టుషాపునకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న కంభం ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ, ఎస్సై సత్యనారాయణరావు పోతురాజుటూరు గ్రామసమీపంలో కారుతో పాటు రమేష్, అనీల్‌లను అదుపులోకి తీసుకున్నారు. యామా చిన్నవెంకటేశ్వర్లు పారిపోయినట్లు తెలిపారు. ఈ మద్యం సీసాలను కారును, నిందితులను గిద్దలూరు కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.


టీడీపీలో చేరిన వైసీపీ అద్దంకి మండల ఎస్సీసెల్ కన్వీనర్ పూనూరి నరేంద్రకు కండువా వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే రవికుమార్

టీడీపీలో చేరిన వైసీపీ ఎస్సీసెల్ నాయకులు

అద్దంకిటౌన్, మార్చి 27: నియోజవర్గ పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి ఎస్సీలకు టీడీపీ చేపట్టబోయే అభివృద్ధి పథకాలను తెలియజేస్తు తెలుగుదేశం పార్టీ కూటమీ విజయానికి కృషి చేయాలని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం వైసీపీ ఎస్సీ సెల్ అద్దంకి మండల అధ్యక్షుడు పూనూరి నరేంద్ర ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ సూచన మేరకు వైసీపీకి, పదవి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. నియోజకవర్గం పరిధిలో అన్ని మండలాల్లో పర్యటించి మాదిగలను సమీకరించి వారిని చైతన్య పరిచి అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ ని మరోమారు శాసనసభ్యులుగా గెలిపించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నరేంద్రకు ఎమ్మెల్యే రవికుమార్ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట పలువురు ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


కొరిశపాడులో ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీడీ రాజేష్

అధిక వేతనం పొందే విధంగా పనిచేయండి

మేదరమెట్ల , మార్చి 27: ఉపాధి పనులు చేస్తున్న వారు గరిష్ఠ వేతనం పొందే విధంగా పనులు చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ ఎస్. రాజేష్ అన్నారు. బుధవారం కొరిశపాడులో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఏపీవో కోటేశ్వరితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు పెరుగుతునందున ఉదయాన్నే పనులలోకి వెళ్ళాలన్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులు జరిగే చోట మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 272 రూపాయల అత్యధిక వేతనాన్ని పొందే విధంగా కూలీలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా అయన కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉపాధి హమీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టాలి

మార్టూరు, మార్చి 27: ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో నితిన్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ గ్రామాలలో కోడ్ ఉల్లంఘించే సంఘటనలను తప్పని సరిగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కోడ్ నిబంధనలను అందరికీ వివరించాలన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించ వలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దారు వై. సంధ్య శ్రీ, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హామీల పేరుతో మళ్లీ జనంలోకి జగన్‌రెడ్డి

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
టీడీపీ నేతలంతా ఐక్యంగా కదిలి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
పలు గ్రామాల నేతలతో సమీక్షలో ఎమ్మెల్యే రవికుమార్


గ్రామాల నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి. మార్చి 27 : గత ఎన్నికల్లో వైసీపీ ప్రజలకు ఇచ్చిన హామీలను 85 శాతం గాలికి వదిలేసిందని, ఇప్పుడు మళ్లీ ప్రజలను మరో మారు మోసం చేసేందుకు జగన్‌రెడ్డి బస్సు యాత్రతో ప్రజల ముందుకు వస్తున్నారని, ప్రజలు ఆయనను సాగనంపేందుకు సిద్ధంగా ఉండాలని అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ కోరారు. పంగులూరు మండలం ముప్పవరం టీడీపీ కార్యాలయంలో అద్దంకి మండలం చక్రాయపాలెం, గోపాలపురం, సింగరకొండపాలెం, కొత్తరెడ్డిపాలెం, చిన్న కొత్తపల్లి, శ్రీనివాసనగర్, శంఖవరప్పాడు, మైలవరం, వెంపరాల గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు కార్యకర్తలతో ఎమ్మెల్యే రవికుమార్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ టీడీపీ నేతంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. గత అయిదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. గతంలో కల్లబొల్లి మాటలతో ప్రజలకు అడ్డగోలుగా హామీలను ఇచ్చి వాటిని అమలు పర్చటం చేతకాక అబద్ధపు ప్రచారం చేస్తూ 95 శాతం హామీలను అమలు చేశామని చెప్పటం సిగ్గు చేటన్నారు. దాదాపు 730 హామీలను ఇచ్చి వాటిల్లో 15 శాతం కూడా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా ఇసుక అడ్డగోలుగా దోచుకుంటున్నారని అయన విమర్శించారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం, మణికేశ్వరం, కొరిశపాడు మండలం అనమనమూరు, తమ్మవరం గ్రామాల పరిధిలో రోజూ వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలి వెళుతోందని, అధికారులు, పాలకులు వాటి గురించి పట్టించుకోవటం లేదని అయన ఆరోపించారు. ఈ సమావేశంలో నేతలు మానం దాసు, కరి పరమేష్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భైరపునేని సత్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు మరికొన్ని గ్రామాల నేతలతో ఎమ్మెల్యే సమీక్ష

మండలంలోని ధేనువకొండ, పేరాయపాలెం, మోదేపల్లి, కుంకుపాడు, కొటికలపూడి, తిమ్మాయపాలెం, రామాయపాలెం, వేలమూరిపాడు, కొంగపాడు, మణికేశ్వరం, విప్పర్లవారిపాలెం, నాగులపాడు, జార్లపాలెం, బొమ్మనంపాడు, ఉప్పలపాడు, గోవాడ గ్రామాల టీడీపీ నేతలతో ఎమ్మెల్యే రవికుమార్ ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం వరకు ముప్పవరం టీడీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.

అభివృద్ధే మన నినాదం

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన టీడీపీ అభ్యర్థి కొండయ్య


దేవినూతలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి ఎం.ఎం కొండయ్య, శ్రేణులు


ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థితో పాటు బాపట్ల అభ్యర్థి నరేంద్రవర్మ, బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్, నేతలు

చీరాల,మార్చి 27 : 'అభివృద్ధే మన నినాదం. చేసేదే చెప్తాం. చెప్పింది చేస్తాం. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు ఖాయం. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారు. అదే లక్ష్యంతో మనం పనిచేద్దాం. ఎన్నికల్లో ఓటుతో ఆశీర్వదించాలని' కూటమి ఉమ్మడి అభ్యర్థి ఎం.ఎం కొండయ్య బుధవారం చీరాల మండలం దేవినూతల నుంచి మిత్రపక్షాలతో కలసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రచారంలో కూటమి బాపట్ల నియోజకవర్గ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి టి. కృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మువ్వల వెంకటరమణారావు, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరి శివరామప్రసాద్ తదితరులు ప్రచార ర్యాలీలో అగ్రభాగాన నిలిచారు. ముందుగా గ్రామంలో పలు చోట్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కొండయ్య తదితరులు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్ తదితరాలను గ్రామస్థులకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

వేటపాలెం(చీరాల),మార్చి 27 : స్థానికంగా బుధవారం ఆర్యవైశ్యులు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సహకరించాలని కోరారు. పలువురు ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి బీసీలు కష్టపడి పనిచేయాలి

ఏలూరిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలి
జయహో బీసీలో రాష్ట్ర అధికార ప్రతినిధి


యద్దనపూడి క్లస్టరులో జరిగిన జయహో బీసీ సమావేశంలో టీడీపీ నేతలు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 27: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీల సంక్షేమం కోసం, బీసీ కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేసిందని రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుంజి వెంకట్రావు అన్నారు. బుధవారం రాత్రి యద్దనపూడి మండలం క్లస్టరు 4 లో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీలు అందరూ ఐక్యత తో పని చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ విజయానికి బీసీలు అందరూ కష్టపడి పని చేయాలన్నారు. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు భారీ మెజారిటీతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారన్నారు. ఈ విజయంలో బీసీలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. ప్రతి బీసీ కుటుంబం ఏలూరిని భారీ మెజారిటీతో గెలిపించడం తమ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ గుదే తారక రామారావు, రావిపాటి సీతయ్య, కనపర్తి నాగేశ్వరరావు, శివ రాత్రి శ్రీను, పోలూరి సింగయ్య, అన్నవరపు వాసుబాబు, అద్దంకి రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొండయ్యకు పెరుగుతున్న మద్దతు


కొండయ్యకు మద్దతు తెలుపుతున్న పలు గ్రామాల మత్స్యకార ప్రతినిధులు

వేటపాలెం(చీరాల),మార్చి 27 : టీడీపీ కూటమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్యకు మద్దతు తెలిపేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మండల పరిధిలోని రామచంద్రాపురం, పుల్లరిపాలెం గ్రామాలకు చెందిన పలువురు మత్స్యకారులు బుధవారం టీడీపీ కార్యాలయంలో కొండయ్యను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, స్థానికంగా అందరిని కలుపుకుపోతానని, తనను ఆశీర్వదించాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

- కాలు విరిగినా వెరవక వీల్‌చైర్‌లోనే హాజరైన విద్యార్థి


వీల్ చైర్‌లో కేంద్రానికి వస్తున్న విద్యార్థి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మార్చి 27 : పది పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయి. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో అధికారులు 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో 1,643 మంది విద్యార్థులకుగాను 40 మంది గైర్హాజరయ్యారు. ఇదిలా ఉంటే చివరి రోజైన సోషల్ పరీక్ష మండల పరిధిలోని తోటవారిపాలెం పంచాయతీ చంద్రమౌళి కాలనీకి చెందిన రంగా ఆకాష్‌కు గండంగా గడిచింది. ఏడాదంతా ఎంతో కష్టపడి చదువుకుని పరీక్షలకు సిద్ధమైన అతనికి మంగళవారం పరీక్ష ముగించుకుని తండ్రి రామ్‌కుమార్‌తో స్కూటర్‌పై ఇంటికి వెళుతుండగా ఈపూరుపాలెం స్టేట్‌బ్యాంకు సమీపంలో సప్లమెంటరీ పరీక్ష ముగించుకుని ఇంటికి మరో స్కూటీపై వెళుతున్న వ్యక్తి వీరిని వేగంగా ఢీ కొట్టాడు. దీంతో ఆకాష్‌కు కాలు విరిగింది. ఈక్రమంలో తండ్రి మంగళవారం రోజే చీరాలలోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స అందించారు. అయితే చివరి పరీక్ష ఎలాగైనా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఆకాష్ మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఐసీయూలోనే ఉండి చదువుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు వీల్‌చైర్‌పై ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి తీసుకురాగా ఆకాష్ ఇబ్బంది పడుతూనే పరీక్ష పూర్తి చేశాడు.

చినగంజాంలో..

చినగంజాం : చినగంజాం, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 18వ తేదీ నుంచి జరుగుతున్న పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి.పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా కనిపించారు. పరీక్షా కేంద్రాల నుంచి బయటకు రాగానే స్నేహితులతో కాసేపు సందడిగా గడిపారు. చినగంజాం పరీక్షా కేంద్రంలో జరిగిన సోషల్ పేపరుకు 260 మందికి గాను 17 మంది , కడవకుదురు పరీక్షా కేంద్రంలో 174 మందికి ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎ.వెంకటసుబ్బారావు, డి.హేమంత్‌కుమార్‌లు తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు


యద్దనపూడిలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలతో పోలీసులు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 27: యద్దనపూడి మండలంలో యద్దనపూడి, గన్నవరం గ్రామాలలో బుధవారం సాయంత్రం మార్టూరు స్టేషన్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. యద్దనపూడి ప్రధాన సెంటరులో, గన్నవరం గ్రామంలో మెయిన్ బజారులో పోలీసులతో కవాతు నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో శాంతి యుతమైన వాతావరణం ఉండాలని, ఎలాంటి గొడవలు ఉండకూడదని రాజశేఖర్ రెడ్డి ప్రజలతో మాట్లాడారు. ఎన్నికలు ముగిసేంత వరకు గ్రామాలపై పోలీసుల కన్ను ఉంటుందన్నారు. అసాంఘిక చర్యలను ప్రోత్సహించాలని ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రజలు సహకరిస్తే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జీవీఎస్ చౌదరి, ఏఎస్ఐ శ్రీనివాసరావు, 30 మందికి పైగా కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నేడు కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ


జాగర్లమూడివారిపాలెం గ్రామంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు చేస్తున్న మహిళలు

పంగులూరు, మార్చి 27 : మండలంలోని జేవీపాలెం గ్రామంలో నూతనంగా నిర్మితమైన శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠా కార్యక్రమం గురువారం ఉదయం జరగనుంది. ఉదయం 7 గంటల 40 నిముషాల నుంచి 8 గంటల 20 నిమిషాల మధ్య కాలంలో శ్రీ హనుమత్ సీతాలక్ష్మణసపరివార సహిత శ్రీ కోదండ రామచంద్రస్వామి, జీవధ్వజ, విమాన శిఖర ప్రతిష్ఠా మహోత్సవానికి ఆలయకమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో భాగంగా బుధవారం విష్వక్సేనారాధనం, పుణ్యాహం, జలాధివాసం, మహాశాంతిహోమం వంటి కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో పలువురు దంపతులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా నడుచుకోవాలి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

వేటపాలెం(చీరాల),మార్చి 27 : ఎన్నికల ప్రక్రియల సజావుగా సాగేలా అధికారులు, సిబ్బంది నడుచుకోవాలని ఆర్డీవో, ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి చెప్పారు. వేటపాలెంలో బుధవారం ఆయన అధికారులు, స్టిబందితో కలసి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ప్రాథమికంగా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి కృషి చేయాలి


కండక్టర్‌లు, డ్రైవర్లకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్ రామ్మోహనరావు

అద్దంకిటౌన్, మార్చి 27: కొటప్పకొండ, శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా అత్యధిక ఆదాయం వచ్చిందని, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజులలో కూడా డిపో అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని డిపో మేనేజర్ బి. రామ్మోహనరావు అన్నారు. బుధవారం డిపో ఆవరణంలో కొటప్పకొండ, శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు, డ్రైవర్‌లను డిపో మేనేజర్‌తో పాటు అసిస్టెంట్ మేనేజర్ మహబూబిలు ప్రశంసా పత్రాలను అందజేయడంతో పాటు బహుమతులను అందించి అభినందించారు.

అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు

ఇంకొల్లు,మార్చి 27: ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు వార్డుల నిర్మాణానికి రూ. 9.80 లక్షల నిధులు మంజూరైనట్లు డీఎంహెచ్‌వో విజయమ్మ తెలిపారు. ప్రసూతి మహిళల సౌకర్యార్థం ఈ గదుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌ను ఆధునీకీకరించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు వార్డుల నిర్మాణానికి నిధుల మంజూరు చేయడంపై సీహెచ్‌వో కోటేశ్వరరావు, వైద్యాధికారి అంజలీ,ఆరోగ్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేడు పాండురంగస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం

మార్టూరు, మార్చి 27: మార్టూరు పడమర బజారులో గురువారం రుక్మాబాయి సమేత పాండురంగ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం 9 వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షులు సకల ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయంలో యజ్ఞాలు, యాగాలు, హోమాలు మధ్యాహ్నం స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అన్న ప్రసాదం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ఈ కార్యక్రమానికి తరలి వచ్చి స్వామి వారి ఆశీస్సులను అందుకోవాలని ఆంజనేయులు ఆ ప్రకటనలో కోరారు.



రంజాన్ వేళలు | ఇఫ్తార్ (గురువారం) : 6.22 | సహరి (శుక్రవారం) : 4.48



భక్తుల నడుమ ఎదురుకోలు ఉత్సవం



వైభవంగా రంగనాథుడి రథోత్సవం

రంగా... రంగ రంగా..!!

రంగా... రంగ రంగా... గోవిందా.. గోవింద... జైజై రంగా... నామస్మరణతో నెల్లూరులోని రంగ నాయకులపేట, సంతపేట ప్రాంతాలు మారుమోగాయి. ప్రసిద్ధ తల్పగిరి రంగనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి కులమతాలకు అతీతంగా వేలాది మంది భక్తులు తరలిరావడంతో స్వామివారి ఆలయ మాడవీధులు కిటకిటలాడాయి.

ఎదురుకోలుకు తరలివచ్చిన వేదగిరీశుడు



ఉదయం ప్రత్యేక పూజల అనంతరం భూ, నీలా సమేత శ్రీరంగనాథస్వామిని వేద మంత్రాలతో పల్లకిలో చిత్రకూటం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో కొలువు దీర్చారు. అనంతరం రథానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ఉత్సవ అధికారి... దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ జీ శ్రీనివాసులు గుమ్మడికాయతో దిష్టితీసి కొట్టారు. ఆ తర్వాత రథం ముందుకు సాగింది. భక్తులు అడుగడుగునా గుమ్మడికాయలు, కొబ్బరి కాయలు, ఉప్పు-మిరియాలు సమర్పించి, కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. తూర్పు వీధి నుంచి ఆలయం వరకు, ఆలయం నుంచి సంతపేట నాలుగుకాళ్ల మండపానికి రథాన్ని భక్తులు ఉత్సాహంగా లాగారు.

● ఆకట్టుకున్న ఎదురుకోలు

రంగనాథస్వామి రథోత్సవానికి వేదగిరి నుంచి



చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నరసింహస్వామి కొండదిగి వచ్చారు. స్వామివారికి వేదగిరి నుంచి నెల్లూరు నగరం వరకు భక్తులు ఆహ్వానం పలుకుతూ కర్పూర నీరాజనాలు అర్పించారు. అనంతరం వేదగిరీశుడి తరపున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథుడికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు ఎదురుకోలు ఘట్టాన్ని ఆసక్తికరంగా నడిపారు. నరసింహ స్వామి అలగడం, రంగనాథస్వామి బతిమలాడడం వంటి ఘటనలతో ఎదురు సన్నాహాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం పూలంగిసేవ, అనంతరం ఊంజల్‌సేవ, పొన్నవాహన సేవ నేత్రపర్వంగా జరిగాయి.

● నేత్రపర్వంగా తెప్పోత్సవం

బుధవారం రాత్రి మూలాపేటలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయ కోనేరులో తెప్పోత్సవం నయనానంద కంగా జరిగింది. రథోత్సవానికి విచ్చేసిన వేదగిరీశుడికి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆతిథ్య మిచ్చి మర్యాదలు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ పుష్ప, విద్యుద్దీపాలంకరణతో తెప్పలను ముస్తాబు చేశారు. చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నరసింహస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పలపై విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



\- నెల్లూరు (సాంస్కృతికం)



మనుబోలులో పదో తరగతి విద్యార్థుల ఆనందం

పరీక్షలు అయిపోయాయ్!

ముగిసిన పదో తరగతి ప్రధాన పరీక్షలు

విద్యార్థులకు ఉపశమనం ● 1 నుంచి మూల్యాంకనం

నెల్లూరు (విద్య), మార్చి 27 : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షల్లో ప్రధాన మైనవి పూర్తయ్యాయి. చివరి రోజు సోషల్ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 176 పరీక్ష కేంద్రాల్లో 29,824 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 28,455 మంది హాజరుకాగా 1,369 మంది గైర్హాజర య్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,428 మందికి 27,735 మంది, ప్రైవేట్ విద్యార్థులు 1,396 మందికి 720 మంది హాజరయ్యారు. విద్యాశాఖ జేడీ, జిల్లా పరిశీలకుడు మువ్వా రామలింగం ఎనిమిది కేంద్రాలను పరిశీలించారు. డీఈవో పీజేవీ రామారావు ఒకటి, ఫ్లైయింగ్ స్క్వాడ్ 59 కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ ఏడాది ఒక్క మాల్ ప్రాక్టీస్ కేసుకూడా నమోదు కాలేదని అధికారులు పేర్కొన్నారు. ఇక, గురువారం ఫస్ట్‌లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్స్), ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్), 30న ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2(సంస్కృతం, అరబిక్, పర్షియన్), ఎస్సెస్సీ ఒకేషనల్(థియరీ) పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కాగా, ఏడాదంతా కష్టపడి చదివిన విద్యార్థులకు పరీక్షలు అయిపోవడంతో ఉపశమనం లభించింది. చివరి రోజున ఉపాధ్యాయులకు, సహచర విద్యార్థులకు కన్నీటితో వీడ్కోలు పలికారు. మరికొంతమంది తల్లిదండ్రుల తో, స్నేహితులతో కలిసి ఐస్‌క్రీమ్ పార్లర్లకు వెళ్లి సేదతీరారు. ఈ పరీక్షలకు సంబంధించి ఏప్రిల్ 1వతేదీ నుంచి 8వతేదీ వరకు మూల్యాంకనం జరుగుతుందని డీఈవో రామారావు తెలిపారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం ఏర్పాటు చేశామని, ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మిగిలిన పరీక్షలు పూర్తయి న వెంటనే సమావేశం నిర్వహించి సిబ్బందికి, ఉపాధ్యాయులకు విధులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

సెలవుపై వెళ్లిపో!

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా, ఆంక్షలు అమలులో ఉన్నా అధికార పార్టీ నాయకులకు మాత్రం లెక్కేలేదు. అధికారులపై పెత్తనం చేయడం మానడం లేదు. ఎన్నికల ప్రచారానికి సహకరించని అధికారులను సెలవుపై వెళ్లిపొమ్మని హుకుం జారీ చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు కట్టుబడి పనిచేసిన పాపానికి ఏం చేయాలో దిక్కుతోచక జిల్లా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. న్యాయం కోసం ఉన్నతాధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తాజాగా జిల్లాలో చోటు చేసుకున్న ఓ సంఘటన అధికారులపై వైసీపీ నాయకుల జులుం ఏ స్థాయిలో కొనసాగుతోందో తెలియజేస్తోంది.

● కందుకూరులో 12 మంది ఆర్పీలను సస్పెండ్ చేయడమే కారణం

● తమ మాటలు వినలేదనే ఉక్రోశం

● ఆంక్షలు అమలులో ఉన్నా.. అడ్డగోలుగా అధికార దుర్వినియోగం



నెల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఎన్నికల ప్రచారానికి వలంటీర్లను, డ్వాక్రా సంఘాలను అడ్డగోలుగా వాడుకునే ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. వీరి ఒత్తిడి తట్టుకోలేక ఎన్నికల ప్రచారాల్లో పాల్గొని ఉద్యోగాలు ఊడగొట్టుకున్న వారి సంఖ్య జిల్లాలో రోజు రోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలోనే డ్వాక్రా సంఘాలను పెద్ద ఎత్తున ప్రచారానికి వినియోగించేలా చూడాలని మెప్మా అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఒత్తిడికి తలొగ్గిన నేరానికి కందుకూరు నియోజక వర్గంలో 12 మంది ఆర్పీలను సస్పెండ్ చేశారు. తమ పరిధిలోని డ్వాక్రా సంఘ మహిళలపై ఒత్తిడి తెచ్చి మేదరమిట్లలో జరిగిన జగన్ సభకు తరలించారన్న అభియోగాలపై ఈ 12 మందిపై చర్యలు తీసుకోవాలని కందు కూరు సబ్‌కలెక్టర్ విద్యాధరి డ్వామా పీడీ రవీంద్రను ఆదేశించారు. ఈ నివేదిక ఆధారంగా డ్వామా పీడీ ఈ నెల 25వ తేదీన కందుకూరు నియోజకవర్గ పరిధిలోని 12 మంది రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లను సస్పెండ్ చేశారు.

● మింగుడు పడకనే!

ఈ ఆర్పీలపై చర్యలు తీసుకోవద్దని వైసీపీలో నెం.2 అయిన నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి మెప్మా పీడీని కోరినట్లు చెబుతున్నారు. అయితే పై అధికారుల ఉత్తర్వులను అమలు చేయక తప్పని పరిస్థితుల్లో పీడీ ఆర్పీలపై వేటు వేయక తప్పలేదని ఆ శాఖ సిబ్బంది అంటున్నారు. ఇదే తరహాలో నెల్లూరు నగరంలో సైతం డ్వాక్రా మహిళలను వైసీపీ ఎన్నికల ప్రచారానికి వినియోగించేలా చూడాలని విజయసాయితో పాటు వైసీపీకి చెందిన ఇతర నాయకులు మెప్మా పీడీపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డిల మాటలను లెక్క చేయడం లేదనే ఉక్రోశం పీడీపై ఉందని ఆ శాఖ సిబ్బంది అంటున్నారు. ఓ వైపు సీఎం సభకు జనాలను తరలించిన ఆర్పీలపై వేటు వేయడం, మరోవైపు నెల్లూరు నగరంతో పాటు జిల్లాలోని మిగిలిన పట్టణాల పరిధిలో మెప్మా సిబ్బందిని అధికార పార్టీ ప్రచారాలకు వినియోగించకపోవడం పై రెండు కారణాలతో మెప్మా పీడీని జిల్లా నుంచి సాగనంపాలని అధికార పార్టీ నాయకులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి మెప్మా పీడీని సెలవుపై వెళ్లిపోవాలని గట్టిగా ఆదేశించినట్లు సంబంధిత శాఖలో ప్రచారం జరుగుతోంది. దీనిని బలపరిచేలా మెప్మా పీడీ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయానికి వెళ్లలేదు. తనను సెలవుపై వెళ్లిపొమ్మని వైసీపీ నేతలు చేస్తున్న ఒత్తిడిని పై అధికారులకు విన్నవించుకున్నట్లు తెలిసింది. అయితే మెప్మా అధికారి వేడుకోళ్ల పట్ల ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో రాజకీయ ఒత్తిళ్లను లెక్కచేయవద్దని మెప్మా అధికారికి ధైర్యం చెబుతారో లేదా చడీచప్పుడు లేకుండా సెలవుపై వెళ్లిపొమ్మని సలహా ఇస్తారో, ఎన్నికల కోడ్ ఎంత పకడ్బందీగా అమలవుతుందో.. అది అధికారులకు ఏ మాత్రం రక్షణగా నిలుస్తోందో ఈ సంఘటనతో రుజువు కానుందని జిల్లా ఉద్యోగ వర్గాలు అనుకొంటున్నాయి.

వ్యక్తిగత విమర్శలు చేయొద్దు

● రాజకీయ ప్రతినిధులతో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 27 : ఎన్నికల ప్రచారాల్లో రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయొద్దని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. వ్యక్తిగత విమర్శలతోపాటు కుల, మతాల ప్రస్తావన లేకుండా ప్రచారం చేసుకోవాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో రాజకీయ పార్టీల ప్రనిధులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు పూర్తి చేసే సమయంలో ఎటువంటి తప్పులు, కొట్టివేతలు లేకుండా ఖాళీలను పూర్తిగా నింపాలన్నారు. ఏప్రిల్ 18న నామినేషన్ల స్వీకరణ, 25న నామినేషన్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు. కాగా, జిల్లాలో ప్రస్తుతం 20,41,258 మంది ఓటర్లు ఉన్నారని, వచ్చే నెల 15 వరకు ఫారం-6 ద్వారా ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. జిల్లాలో ఫారం-6కు సంబంధించి 6644 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, జి. నారాయణ (వైసీపీ), చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి (టీడీపీ), శ్రీనివాస్ (బీజేపీ), మస్తానయ్య, శ్రీరామ్ (బీఎస్పీ), ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంటు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● ఓట్లు లెక్కింపు కేంద్రం వద్ద పటిష్ఠ భద్రత

నెల్లూరురూరల్ : ఓట్లు లెక్కించే ప్రాంతాలు, కేంద్రాలు వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం హరినారాయణన్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డితో కలిసి రూరల్లోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఉన్నందున అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైట్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతరం నిఘా కోసం సీసీ కెమెరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. వారి వెంట జేసీ సేతు మాధవన్, ఎన్ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్, అదనపు ఎస్పీ సౌజన్య ఉన్నారు.

కోవూరును రోల్‌మోడల్‌గా అభివృద్ధి చేస్తాం

● రామతీర్థం ప్రచారంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

విడవలూరు, మార్చి 27 : ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో తనను, కోవూరులో ప్రశాంతిరెడ్డిని గెలిపిస్తే కోవూరును రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా అభివృద్ధి చేస్తామని టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రామ తీర్థం గ్రామంలోని కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేమిరెడ్డి దం పతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొన్నపూడి కొత్తూరులో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డితో కలిసి ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి తిరుగుతూ కరపత్రాలు అందజేసి సైకిల్ గుర్తుకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల దగ్గర నుంచి వీధిదీపాల వరకు, యువతకు ఉద్యోగాలు, స్థానిక మత్స్యకారులకు వసతులు వంటివి అనేకం ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వైసీపీని ఓడించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తే జిల్లాతో పాటు కోవూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆవుల వాసు, కల్యాణ్‌రెడ్డి, కొడూరు కమలాకర్‌రెడ్డి, ఆవుల రవీంద్ర, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, ఎస్.కె. రఫీ, ఉచ్చూరు సుదీప్ రెడ్డి, శ్రీహరికోట గోపి, కోమారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రామతీర్థం, రామచంద్రాపురం గ్రామాల్లో వేమిరెడ్డి దంపతులకు ప్రజలు, మత్స్యకారులు అడుగడు గునా బ్రహ్మరథం పట్టారు. బాణాసంచా కాల్చి, తీన్మార్ బ్యాండ్‌లతో ప్రచారం జరుగు తుండగా మహిళలు గుమ్మడి కాయలతో దిష్టి తీశారు.





ప్రచార రథంపై వేమిరెడ్డి దంపతులు

రేపు కావలి, వింజమూరులలో 'ప్రజాగళం'!

● రానున్న టీడీపీ అధినేత చంద్రబాబు




కావలిలో నాయకులతో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

కావలి/వింజమూరు, మార్చి 27 : టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేపట్టిన 'ప్రజాగళం' కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం కావలి, వింజమూరులలో జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లను బుధవారం టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర, అభ్యర్థులు కాకర్ల సురేష్, కావ్య క్రిష్ణారెడ్డి తదితరులు పరిశీలించారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించి కేడర్‌కు పలు సూచనలు చేశారు. కావలిలోని జడ్పీ స్కూల్ క్రీడా మైదానం వద్ద హెలిప్యాడ్ నుంచి తుమ్మలపెంట రోడ్డు మీదుగా ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌కు వచ్చి అక్కడ సభలో చంద్రబాబు మాట్లాడనున్నట్లు నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలేపాటి సుబ్బానాయుడు, పమిడి రవికుమార్ చౌదరి, కొండూరు పోలిశెట్టి, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతిబాబూరావు, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వింజమూరు పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు సమీపంలో ఉన్న టీడీపీ కార్యాలయం నుంచి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు, రాబిన్‌శర్మ టీంతో కలిసి బంగ్లా సెంటర్, ఆర్టీసీ, పంచాయతీ, పాత బస్టాండ్ సెంటర్లను బీద రవిచంద్ర పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గొంగటి రఘునాథరెడ్డి, రవీంద్రబాబు, కాకర్ల వెంకట్, చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, చల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాలువలు... ఆందోళనలో ఆయకట్టు రైతులు

వరికుంటపాడు, మార్చి 27: పొన్నెబోయిన చెంచురామయ్య(గండిపాలెం) జలాశయం ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూతవేటు దూరంలో రిజర్వాయర్ ఉన్నా రైతులకు సాగునీరు అందని ద్రాక్షగానే మిగిలింది. ఏళ్ల తరబడి ఇదే తంతే కొనసాగుతుండడంతో వరికుంటపాడు, ఉదయగిరి మండలాల రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ రిజర్వాయర్ పరిధిలో మొత్తం 16వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, అందులో ఎడమ కాలువ కింద వరికుంటపాడు మండలం పరిధిలోనే 11వేల ఎకరాలు ఉండడం గమనార్హం. అలాగే కుడి కాలువ కింద ఉదయగిరి, వరికుంటపాడు మండలాలను కలిపి మరో 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ప్రధాన కాలువలతోపాటు లింకు కాలువలు అధ్వానంగా మారాయి. పూడికతోపాటు చిల్లచెట్లు మొలిచాయి. దీంతో చెరువులకు నీరందించే పరిస్థితులు లేవు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించి జలాశయం కాలువలను మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన పంట కాలువ

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు : విద్యార్థుల కేరింతలు



సంగం : పరీక్షలు ముగియడంతో పరీక్ష హాలు నుంచి ఆనందంగా బయటకు వస్తున్న విద్యార్థులు



ఉదయగిరి పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, మార్చి 27: మండలంలో బుధవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గండిపాళెం గురుకుల పాఠశాల, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత, సెయింట్ మేరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల పరీక్ష కేంద్రాల్లో ఈనెల 18న పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకొన్నారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్ద కేరింతలు కొట్టారు.

సంగం : పది పరీక్షలు బుధవారం ముగిశాయి. సంగంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షలు జరిగాయి. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు పరీక్ష హాలు నుంచి సంతోషంగా బయటకు వచ్చారు. ఇక ఎవరి ఇళ్లకు వారు వెళ్లనుండడంతో విద్యార్థులు బాధను వ్యక్తం చేశారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఉదయగిరి, మార్చి 27: ఎన్నికల సిబ్బందికి రెండు రోజులపాటు శిక్షణ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయగిరిలోని మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో గురు, శనివారాల్లో పీవో, ఏపీవోలకు శిక్షణ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన పీవో, ఏపీవోలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

తపాలా బీమాపై అవగాహన సదస్సు

ఆత్మకూరు, మార్చి 27 : స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు తపాలా శాఖలో బీమా సౌకర్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఏఎస్పీ అహ్మద్‌హుస్సేన్ మాట్లాడుతూ తపాలా బీమా(జెడ్‌పీపీబీ, జీఏజీ) పాలసీలను గురించి వివరించారు. ఏడాదికి రూ. 755లు చెల్లిస్తే రూ. 15 లక్షల బీమా సౌకర్యం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జెడ్‌పీపీబీ శాఖ అసిస్టెంట్ మేనేజర్ గిరీష్, పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవ పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, మార్చి 27 : పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయాన్ని స్థానిక నేతలు ప్రారంభించారు. పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పలువురు టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపాలన ముగింపునకు సమయం ఆసన్నమైందన్నారు. ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఉదయగిరి రూరల్, మార్చి 27: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా గురువారం ఉదయగిరితోపాటు గన్నేపల్లి, నేలటూరు పంచాయతీల్లో ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జి ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిరుపయోగంగా మార్కెట్ యార్డు గదులు



నిరుపయోగంగా గదులు

అనంతసాగరం, మార్చి 27: స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో మార్కెట్ యాడ్ ఆధ్వర్యంలో నిర్మించిన గదులు నిరుపయోగంగా ఉన్నాయి. సుమారు 20 ఏళ్ల క్రితం వీటిని నిర్మించి వినియోగంలోకి తీసుకురాకుండానే వదిలేశారు. దీంతో కాంప్లెక్స్‌లోని ఆరు గదులు శిథిలావస్థకు చేరాయి. ఇది ఇలా ఉంటే దుండగులు కొన్ని గదులకు ఉన్న షెట్టర్లను చోరీ చేశారు. అయిన అధికారుల్లో చలనం లేదు. ఇకనైనా వీటిని వినియోగంలోకి తీసుకువస్తే పంచాయతీకి మరింతగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో కాకర్ల సురేష్



స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించిన కాకర్ల సురేష్

సీతారామపురం, మార్చి 27: మండలంలోని అయ్యవారిపల్లిలో ఉన్న జగన్మాత ఈశ్వరి దేవి ఆలయంలో బుధవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, మహాగణపతి సిద్ధమూర్తి, నాగదేవతలు, నవగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాల్లో ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొంగటి రఘునాథరెడ్డి,మనోజ్ బాబు, పిడుగు రమేష్, పెద్దగౌస్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొనారు.

వివాహ వేడుకల్లో కాకర్ల

సీతారామపురం పంచాయతీ పరిధిలోని సంగసానిపల్లెలో బుధవారం జరిగిన టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు-చంద్రమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస్ వివాహ వేడుకల్లో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ పాల్గొన్నారు. అనంతరం సీతారామపురం జగనన్న కాలనీలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాకర్ల వెంకటసుబ్బరాయుడు, చింతల శ్రీనివాసులు,వెంగళశెట్టి వెంకటయ్య, కప్పా ప్రభాకర్‌రాజు, జాషువా, చెన్నకేశవులు,అబ్రహం, తదితరులు పాల్గొనారు.

రేపు చంద్రబాబు సభ

ఉదయగిరి రూరల్, మార్చి 27: వింజమూరులో శుక్రవారం మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రజాగళం సభను నిర్వహించనున్నట్లు నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి ప్రజాగళం సభను విజయవంతం చేయండి

ఏఎస్‌పేట, మార్చి27: ఏఎస్ పేటలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే ప్రజాగళం సభను విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ సభలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు నంది వివేకానందరెడ్డి, మాధవరెడ్డి,సుధాకర్‌రెడ్డి, ఖాజామియ్య, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

టీడీపీని వీడే ప్రసక్తే లేదు : బొల్లినేని



బొల్లినేనిని సన్మానించిన టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, మార్చి 27: తనకు అధిష్ఠానం ఎమ్మెల్యే టికెట్ నిరాకరించడంతో చాలామంది తమతమ పార్టీల్లో చేరాలని ఫోన్లు చేస్తున్నారని, అయితే తాను టీడీపీని వీడే ప్రసక్తే లేదని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు స్పష్టం చేశారు. బుధవారం రాత్రి స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గత 14 ఏళ్లుగా తనతోటి ప్రయాణం చేసిన వారిని జీవితంలో మరవనన్నారు. వ్యక్తులు కాదు పార్టీ ముఖ్యమన్నారు. పార్టీ నిర్ణయానికి ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. అధిష్ఠానం ఎవన్ని నిర్ణయిస్తే వారికి సహకరించాలన్నారు. చంద్రబాబు ఎవరికీ లేనివిధంగా తనకు గౌరవం ఇచ్చారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయఢంకా మోగిస్తుందన్నారు. అనంతరం బొల్లినేనిని నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పీ చెంచలబాబు యాదవ్, బయ్యన్న, వెంకటరత్నం, రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై వ్యాఖ్యలు అర్థరహితం



విలేకరులతో మాట్లాడుతున్న రాజగోపాల్

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మార్చి 27: వలంటీర్లపై ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సంక్షేమ పథకాలతోపాటు ఆరోగ్య సేవలందించిన వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు అభినవ్‌రెడ్డి, ఎల్‌పీ మాలకొండారెడ్డి, కండ్లగుంట వెంకటరెడ్డి, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రాభివృద్ధి జగన్‌కే సాధ్యం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల్లో నగదు జమ అయ్యేనా ?

● రైతులకు తప్పని నిరీక్షణ ● అందని మిచౌంగ్ తుఫాన్ పరిహారం

ఉదయగిరి రూరల్, మార్చి 27: చేసేది గోరంత. చెప్పుకునేది కొండంతలా ఉంది వైసీపీ ప్రభుత్వం తీరు. తాను బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నట్లు సీఎం జగన్ పదేపదే చెబుతున్నారు. వాస్తవానికి నగదు కోసం లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడంలేదు. ఉదాహరణకు మిచౌంగ్ నష్టపరిహారమే. ప్రకృతి వైపరీత్యాలతో వాటిల్లిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోపే పరిహారం అందిస్తామంటూ జగన్ డప్పు కొట్టారు. ప్రచార ఆర్భాటం తప్ప మిచౌంగ్ తుఫాన్ బాధితులకు నేటికీ సాయం అందలేదు.

ఎన్నికల ముందు ఇవ్వడానికేనా...? : సార్వత్రిక ఎన్నికల వేళ రైతులకు పంట నష్ట పరిహారం పంపిణీకి హడావిడి చేశారు. సీఎం జగన్ పంట నష్ట పరిహారం ప్రకటించారు. రైతు ఖాతాల్లోకి వేస్తున్నామని ఈనెల 6న బటన్ నొక్కారు. జిల్లాలో 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లలో వర్షాభావం, మిచౌంగ్ తుఫాన్ వల్ల ఉద్యానవన పంటల రైతులు 3,833 మందికి రూ.2.32 కోట్లు, పంటలు దెబ్బతిన్న 425 మంది రైతులకు రూ.33 లక్షలు పెట్టుబడి సాయం అందించారు. బటన్ నొక్కి రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో పరిహారానికి సంబంధించిన నగదు పడకపోవడంతో వారు నిరీక్షిస్తున్నారు.

తాగునీటి పైపులైన్ లీక్

● రోడ్డుపై నిలిచిన నీరు ● అవస్థల్లో ప్రజలు, వాహనదారులు



మొగిలిచెర్లలో ఎస్సీ కాలనీలో పైపులైన్ లీకై రోడ్డుపై నిలిచిన నీరు

లింగసముద్రం, మార్చి 27: మండలంలోని మొగిలిచెర్ల ఆదిఆంధ్ర కాలనీలోని పాఠశాల ఎదురుగా ఉన్న మంచినీటి పైపులైన్ లీకై నీరు వృథాగా పోతోంది. ఈ నీరు రోడ్డుపై నిలిచి మడుగులా మారింది. దీంతో ప్రజలు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజుల నుంచి పైపులైన్ లీకై దోమలకు నిలయంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అంతేకాక ఈ రోడ్డు మీదుగా దత్తాత్రేయస్వామి దేవాలయానికి ప్రతినిత్యం బస్సులు, వాహనాలు వెళుతుంటాయి. ఆ సమయంలో నీరు రోడ్డు పక్కనే వెళ్లే వారిపై వెదజల్లుతోంది. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

టీడీపీతోనే మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

● ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర



మాట్లాడుతున్న బీద రవిచంద్ర

కావలి, మార్చి 27: మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపింది టీడీపీ ప్రభుత్వం మాత్రమేనని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడిని బోగోలు మండలం చెన్నారాయునిపాలెం పంచాయతీలోని పలు గ్రామాల మత్స్యకారులు బీద రవిచంద్ర సమక్షంలో కలిసి మద్దతు తెలిపారు. బీద మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అధికారులు మత్స్యకారులను ఇబ్బందులు పెట్టారిని, టీడీపీ ప్రభుత్వంలో ఏనాడైనా ఇలాంటి పరిస్థితి లేదన్నారు. అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడిని చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధితోపాటు యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల వైసీపీలో ఉండి అనేక ఇబ్బందులు పడ్డానని, సామాన్య కార్యకర్తకన్నా ఘోరంగా అవమానించారన్నారు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనేవి వైసీపీలో ఉండవని అరాచకం, అవినీతి దోపిడీలే ఉంటాయన్నారు. టీడీపీ నేత మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కావలిలో దోపిడీలు, అరాచకాలు అడ్డులేకుండా పోయాయని, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బీద గిరిధర్, కండ్లగుంట మధుబాబునాయుడు, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మాలేపాటి నాగేశ్వరరావు, కొండూరు పోలిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో ఎన్నికల ప్రచారం

పట్టణంలోని 18వ వార్డులో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఆవార్డు ఇన్‌చార్జి శానం హరి, క్లస్టర్ ఇన్‌చార్జి మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. బాబు ష్యూరిటీ. భవిష్యత్తు గ్యారెంటీ పేరిట అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాల గురించి, వాటివలన కలుగు ప్రయోజనాల గురించి వివరించారు.

చలివేంద్రం ప్రారంభం

19వ వార్డులో అమీర్‌ఖాన్ తన తల్లి అజిజున్నీసా పేరు మీద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు ఇన్‌చార్జి ఏగూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినాశనానికే బ్రాహ్మణులపై వైసీపీ దాడులు



మాట్లాడుతున్న బ్రాహ్మణసంఘం నేతలు

కావలి, మార్చి 27: వైసీపీ వినాశనానికే ఆలయాల్లో పూజలు చేసే బ్రాహ్మణులపై వైసీపీ నాయకులు దాడులు చేస్తున్నారని బ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. కావలి టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో బ్రాహ్మణ సంఘం నాయకులు బిట్రగుంట శివప్రసాద్, వెంకటశేషయ్య, టంగుటూరి ప్రకాష్‌రావు, శేషగిరిరావులు మాట్లాడారు. 5 ఏళ్ల వైసీపీ ప్రభుత్వంలో బ్రాహణులపై దాడులు జరుగతూనే ఉన్నాయన్నారు. పాలతో అభిషేకం సరిగా చేయలేదని కాకినాడలోని శివాలయంలో ఒక బ్రాహ్మణుడిపై వైసీపీ నాయకులు దాడి చేయడాన్ని ఖండించారు. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న ఈ దాడులకు జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వైసీపీని ఓడించడానికి బ్రాహ్మణులందరూ కంకణం కట్టుకుని 2024 ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవాలని ప్రతి గుడిలో పూజలు చేయనున్నట్లు తెలిపారు. బ్రాహ్మణుల ఐక్యతను, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను కాపాడుకోవటానికి బ్రాహ్మణులకు టీడీపీ సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులందరూ చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకునే విధంగా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

టీడీపీ అభ్యర్థులను ఆదరించండి



ఇంటింటా ప్రచారంలో బీద గిరిధర్, తదితరులు

అల్లూరు, మార్చి 27 : సైకిల్ గుర్తుకు ఓటేస్తే భవిష్యత్తుకు ఓటేసినట్లని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ కోరారు. బుధవారం ఆయన అల్లూరు పట్టణ పరిధిలోని అల్లూరుపేటలోని 10వ వార్డు, గాలిదిబ్బలు, నాగులదేవిగుంట, చుక్కవానిదిబ్బ, గుడివాడిగుంట తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డిల వి.యానికి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, అరగల రమణయ్య, అనూరాధ, యేటూరు దయాకర్ రెడ్డి, మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులురెడ్డి, బిట్రగుంట చైతన్య, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత సుబ్బారెడ్డి టీడీపీలో చేరిక



సుబ్బారెడ్డితో వేమిరెడ్డి

ఉలవపాడు, మార్చి 27 : ఉలవపాడుకు చెందిన వైసీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ భర్త మల్లవరపు సుబ్బారెడ్డి బుధవారం నెల్లూరులోని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో టీడీపీలో చేశారు. ఆయనకు వేమిరెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుల గెలుపు కోసం నావంతు కృషి చేస్తానని తెలిపారు.

కలుగోళమ్మకు పూజలతో ప్రచారానికి శ్రీకారం



కళుగోళమ్మకు పూజలు చేస్తున్న పసుపులేటి

కావలిటౌన్, మార్చి 27: కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా పోటీ చేయనున్న పీఎస్సార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ బుధవారం తన అనుచరులతో కలిసి కళుగోళ శాంభవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 12 వార్డు అరుంధతీపాలెంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రూ.150 కోట్ల సొంత నిధులతో కావలి నియోజకర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి అనుచరులు దావులూరి శ్యామ్‌శనన్, పసుపులేటి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు గౌడ్, కోట వెంకట్, షేక్ షమి, కంచర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన



పోలీసుస్టేషన్ వద్ద మృతురాలి బంధువులు

కందుకూరు, మార్చి 27: మండలంలోని మోపాడు సమీపంలో ఆటోను పొగాకు చెక్కుల ట్రాక్టరు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు బుధవారం కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ట్రాక్టరు డ్రైవరు నిర్లక్ష్యం వల్లే లక్ష్మమ్మ మృతి చెందడంతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని, లక్ష్మమ్మ మృతితో ఆమె కుటుంబం అనాథగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. లక్ష్మమ్మ భర్త డయాలసిస్ పేషెంట్ కాగా ఆమె లేకపోవడంతో ఆయన పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొన్నారు. మృతురాలు, గాయపడ్డ వారు నిరుపేదలు అయినప్పటికీ పోలీసులు ట్రాక్టరు డ్రైవరును, యజమానికి ఇబ్బందిలేకుండా ఉండేలా వ్యవహరిస్తున్నారని, తక్షణం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

కొండాపురం-హైదరాబాద్ బస్సును కుదించడంపై ప్రయాణికుల ఆందోళన

లింగసముద్రం, మార్చి 27 : కొండాపురం-హైదరాబాద్ బస్సును లింగసముద్రం వరకు కుదించడంపై ప్రయాణికులు బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కందుకూరు డిపో నుంచి లింగసముద్రం మీదుగా కొండాపురం వెళ్లి తిరిగి కందుకూరు చేరుకుని అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లే ఈ బస్సును డిపో అధికారులు ఇటీవల కాలంలో కొండాపురం వెళ్లకుండా లింగసముద్రంలోనే నిలిపి వేస్తున్నారని పేర్కొన్నారు. అంతేగాక లింగసముద్రంలో కూడా బస్టాండ్ వరకు వెళ్లకుండా తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్దనే నిలిపి వేస్తున్నారని తెలిపారు. దీంతో కొండాపురం, లింగసముద్రం బస్టాండ్‌లో దిగే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతునారని పేర్కొన్నారు. అలాగే కొండాపురం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయితే తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద ఈ బస్సులో నిమ్మకాయల బస్తాలు లోడ్ చేసుకుంటూ కొండాపురం వెళ్లడం లేదని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

గుడ్లూరు, మార్చి 27 : మండలంలోని తెట్టుకు సమీపంలోని మామిడితోటల్లో పేకాట ఆడుతున్న నలుగురుని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి జూదరులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.5040, 4 సెల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలిపారు. పట్టుపడిన నలుగురుపై కేసు నమోదు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

నేడు పీవోలు, ఏపీవోలకు శిక్షణ

కావలి, మార్చి 27: కావలి నియోజకవర్గంలోని ఎన్నికల పీవోలు, ఏపీవోలకు తొలి బ్యాచ్‌కు స్థానిక విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని కావలి రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పీవోలు, ఏపీవోలు 630 మంది ఉన్నారన్నారు. వారిలో సగం మందికి గురువారం, మరో సగం మందికి శుక్రవారం రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఉంటుందని, ఎవరెవరికి ఏరోజో ముందుగా తెలియజేశామన్నారు. ఈ శిక్షణకు ఎవరైనా గైర్హాజరైతే కఠిన చర్యలతోపాటు అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు శిక్షణకు హాజరుకావాలని కోరారు.

2కే 24 క్రీడా పోటీల ప్రారంభం

బిట్రగుంట, మార్చి 27: బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో 2కే24 క్రీడలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా జేబీ కళాశాల పీడీ డాక్టర్ పీ.ప్రసాద్‌రెడ్డి హాజరై క్రీడలు ప్రారంభించారు. విద్యార్థులకు రన్నింగ్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, త్రో బాల్, జావలిన్‌త్రో వంటి క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి, పీఈటీ ఏ.కిరణ్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బిట్రగుంట, మార్చి 27: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలో వెలసి ఉన్న కోదండరామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహంచారు. గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.